# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 131 | విశాఖపట్నం | 11-2-2026 బుధవారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue :131 | VISAKHAPATNAM | 11-2-2026 WEDNESDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



## రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902




2లో

డబ్బులు లేక బైక్ పైనే 10 కి.మీ మృతదేహాన్ని తీసుకెళ్లారు..!

గ్యాస్, అజీర్తి, మలబద్ధకం.. అన్నింటికీ ఒకేసారి చెక్ పెట్టాలంటే..



6లో



5లో

ఏపీలో ఆన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు రూ.2,279 కోట్లు

## పార్లమెంటులో ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధతపై

# బిల్లు పెట్టాలి: చంద్రబాబు





**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢీల్లీలో పర్యటిస్తున్న క్రమంలో ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీలో ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత వ్యవహారంపై చర్చించారు. ఇప్పటికే పార్లమెంటులో బిల్లు పెట్టాలని కేంద్రం నిర్ణయించగా, అందుకు అనుగుణంగా కేబినెట్ నోట్ తయారీ జరుగుతుంది. బడ్జెట్ రెండో దశ సమావేశాల్లో బిల్లు పెట్టాలని చంద్రబాబు అమిత్‌షాను కోరారు. దీనికి ముందే కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమైన సీఎం ఏపీలోని సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు, ఆర్థిక సాయం కోరుతూ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల భవిష్యత్తు, తాగునీటి భద్రత, వివిధ ప్రాజెక్టులకు కేంద్ర సాయం విషయంలో పెండింగ్ అంశాలపై చర్చించారు. అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపైనా సీఎం చర్చించారు. పోలవరం ప్రాజెక్టు స్టాప్ వర్క్ ఆర్డర్ శాశ్వతంగా ఎత్తివేసేలా చూడాలని విన్నవించినట్లు సమాచారం. స్టాప్‌వర్క్ ఆర్డర్ వల్ల ప్రాజెక్టు అమలులో అవరోధాలు ఏర్పడుతున్నాయని వివరించారు. పోలవరం కాలువల సామర్థ్యం పెంపుతో పెరిగిన వ్యయం రీయింబర్స్ చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు ఫేజ్ -2కి ఆర్థిక సహాయం అందించాలని, ఫేజ్-2లో భూసేకరణ, పునరావాసం, రక్షణ కట్టల పనులు చేపట్టాల్సి ఉందని వివరించారు. ఈ పనులకు అదనంగా సుమారు రూ.32 వేల కోట్లు అవసరమని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. (తరువాయి 2వ పేజీలో)

## జీఎస్‌డీపీపై చంద్రబాబు ప్రభుత్వం

# తప్పుడు లెక్కలు: జగన్




**తాడేపల్లి, పతాకం న్యూస్:** వైసీపీ అధినేత జగన్ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం మాత్రం తప్పుడు జీఎస్‌డీపీ (స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి) గణాంకాలతో ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందనే భ్రమ కల్పించేందుకే ఈ అబద్ధపు ప్రచారం చేస్తున్నారని జగన్ దుయ్యబట్టారు. ప్రభుత్వం విడుదల చేసిన వివరాల ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 11.75 శాతం వృద్ధి సాధించిందని, 2025-26లో ఇది 10.75 శాతంగా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు పేర్కొనడాన్ని జగన్ తప్పుబట్టారు. ఈ వృద్ధి రేటుతో దేశంలోనే మూడో స్థానంలో ఉన్నామని ప్రభుత్వం చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. ఈ లెక్కలు ఏ స్వతంత్ర సంస్థ ఇచ్చినవి కావని, కేవలం చంద్రబాబు కార్యాలయంలో సృష్టించినవని ఆయన విమర్శించారు. ప్రభుత్వం చెబుతున్న వృద్ధి నిజమైతే, పన్నుల రాబడిలో కూడా అదే స్థాయి పెరుగుదల కనిపించాలని జగన్ అన్నారు. కానీ, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 9 నెలలకు (తరువాయి 2వ పేజీలో)

## విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** విశాఖపట్నంలో మెట్రో రైలు ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సిఎం చంద్రబాబు మంగళవారం ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. ఈరోజు కేంద్ర మంత్రులతో భేటీలో భాగంగా ... కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమ య్యారు. చంద్రబాబు ఈ విషయాన్ని వెల్లడించారు. విశాఖ పట్నం, విజయవాడ నగరాల్లో మెట్రో రైలు ప్రాజెక్టుల నిర్మా ణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రతిపాదనలు పంపగా, వాటిని పరిశీలించిన కేంద్రం విశాఖ మెట్రోకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. త్వరలోనే ప్రాజెక్టుకు నిధులు, ఆపై పనులు ప్రారంభమైతే.. విశాఖపట్నం మెట్రోపాలిటన్ నగరాల జాబితాలోకి చేరుతుంది.

## హైదరాబాద్ శివారులో భూప్రకంపనలు... బయటకు పరుగుతీసిన ప్రజలు



**హైదరాబాద్, పతాకం న్యూస్:** హైదరాబాద్ శివారులో మంగళవారం స్వల్పంగా భూప్ర కంపనలు వచ్చాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ గాజులరామారం లోని మెట్‌ఖాన్‌గూడ ప్రాంతంలో ఉదయం 10:10 గంటలకు భూమి కంపించినట్లు శబ్దం వచ్చింది. దీంతో ఇళ్లలో ఉన్న ప్రజలు బయటకు పరుగు తీశారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా గేటెడ్ కమ్యూనిటీ, అపార్టుమెంట్లు ఉన్నాయి. ప్రకంపనలు రావడంతో వారు ఒక్క సారిగా భయపడి బయటకు వచ్చారు. అయితే ఇది భూమి కంపించడం వల్ల జరిగిందా? లేక చుట్టుపక్కల పేలుడుతో వచ్చిన ప్రకంపనలా అనేది తెలియాల్సి ఉంది. గేటెడ్ కమ్యూనిటీల్లోని సీసీ కెమెరాల్లో భూమి కంపించినట్లు కనిపించింది.

## లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం.. నోటీసులిచ్చిన కాంగ్రెస్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చారు. మంగళవారం మధ్యాహ్నం కాంగ్రెస్ ఎంపీలు లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు నోటీసులు అందజేశారు. అవిశ్వాసం నోటీసులపై 119 మంది ఎంపీలు సంతకాలు చేశారు. కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ ఎంపీలు సంతకాలు చేసిన వారిలో ఉన్నారు. అయితే ఇండియా కూటమిలోని కొన్ని పార్టీలు అవిశ్వాసం నోటీసులపై సంతకాలు చేసేందుకు ఒప్పుకోలేదు. ఈ అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చేందుకు టీఎంసీ నిరాకరించింది. కాగా.. సభలో తాము మాట్లాడేందుకు స్పీకర్ ఓం బిర్లా అనుమతించడం లేదంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. తాజా బడ్జెట్ సమావేశాల సందర్భంగా 8 మంది ప్రతిపక్ష పార్టీల ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. భారత్-చైనా ఉద్రిక్తతలకు సంబంధించి ఆర్మీ మాజీ చీఫ్ నరవణె అముద్రిత పుస్తకంలోని అంశాలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చర్చకు పట్టుబట్టిన నేపథ్యంలో ఎంపీలు నిరసనలకు దిగి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ నేపథ్యంలోనే స్పీకర్ తీరుపై ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానానికి పూనుకుంది.


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## సమ్మె

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న సమ్మె చేయాలని 11 జాతీయ కార్మిక సంఘాలు, 500 పైగా సంఘాలతో ఏర్పడిన సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చాయి. గతంలో 22 సమ్మెలు జరిగాయి. కార్మిక వర్గం 1992 నుంచి సరళీకరణ, ప్రైవేటీకరణ, హైర్ అండ్ ఫైర్, వేతనాలు, పెన్షన్ తదితర విధానాలపై పోరాడుతున్నాయి. ఈ పోరాటాలు కార్పొరేట్లకు కంటగింపుగా ఉన్నాయి. కార్పొరేట్ల ఒత్తిడితో కార్మిక వర్గానికి ప్రాథమిక హక్కులు లేకుండా చేసే 4 లేబర్ కోడ్స్‌ను కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చింది. దీనితో సంఘం పెట్టుకొనే హక్కు, సమ్మె చేసే హక్కు, బేరసారాలాడే ప్రాథమిక హక్కులు లేకుండా పోతాయి. బ్రిటిష్ కాలంలో లాగే కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా మార్చడానికి సిద్ధపడింది. అందువల్ల ఫిబ్రవరి 12న చేయబోయే సమ్మె...గత సమ్మె లాంటిది కాదు. చావో రేవో తేల్చుకొనే సమ్మె ఇది. 4 లేబర్ కోడ్‌లు రద్దు అయితేనే కార్మిక వర్గం గౌరవంగా పనిచేయగలదు. సర్వ సంపదలు సృష్టించేది, ప్రజలకు విద్య, వైద్యం, తదితర సేవలన్నీ అందించేది కార్మికవర్గం. కార్మిక వర్గం ఐక్యంగా పోరాడితే పాలక వర్గాన్ని, దేశాన్నీ స్థంభింపజేయగలదు. కార్మిక వర్గాన్ని తమ ఇష్టం వచ్చినట్లు శాసించగలమని కార్పొరేట్ల చేతిలో కీలుబొమ్మగా వున్న పాలకవర్గం అహంకారంతో వ్యవహరిస్తున్నది. మన్మోహన్ సింగ్ రెండేళ్ళలో ప్రైవేటీకరించా లనుకున్న భారీ ప్రభుత్వ రంగ పరిశ్రమలను 32 ఏళ్లు అయినా ప్రైవేట్‌పరం చేయడం సాధ్యం కాలేదు. ఇన్సూరెన్స్, బ్యాకింగ్, పరిశ్రమల్లో సంస్కరణలు అమలు చేయడానికి ఆ రంగాల్లోని యూనియన్లు అడ్డు పడుతున్నాయి. దేశ సంపదను అదానీ, అంబానీ లాంటి పది మంది బడా కార్పొరేట్లకు కట్టబెట్టడానికే కేంద్ర బిజెపి ప్రభుత్వం 4 లేబర్ కోడ్స్ తెచ్చింది. ప్రభుత్వ రంగంలోని భారీ పరిశ్రమలు, గనులు, సముద్ర తీరాన్ని కార్పొరేట్లకు అప్పగిస్తున్నది. భారతదేశం నేటికీ వ్యవసాయ దేశం. 60 శాతానికి పైగా ప్రజలు ఉపాధికి వ్యవసాయంపై ఆధారపడి అతి తక్కువ ఆదాయాలతో బతుకుతున్నారు. రైతాంగానికి గిట్టుబాటు ధర లేదు. పైగా వ్యవసాయ కార్మికులకు ఉపాధి పథకం ద్వారా లభించిన హక్కుకు రక్షణ లేకుండా చేసింది. కొత్తగా తెచ్చిన వి.బి.జి.రాంజీ చట్టం ప్రకారం 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడం అసాధ్యం. క్రమంగా ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి వ్యవసాయ కార్మికులకు ఉపాధి లేకుండా చేస్తుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు దేశ ఆర్థికాభివృద్ధికి పట్టుగొమ్మలు. ఈ సంస్థల వల్ల దేశ స్వావలంబన సాధ్యమైంది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లతో సామాజిక న్యాయం సాధ్యమైంది. కానీ 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ను ప్రైవేట్‌పరం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆతృత ప్రదర్శిస్తున్నాయి. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించలేదు. 2021 జనవరి 27న కేంద్ర ప్రభుత్వం నూరు శాతం వాటాలను అమ్ముతామని నోటిఫికేషన్ జారీ చేసింది. 10,000 మంది పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులను అక్రమంగా తొలగించింది. విశాఖ స్టీల్‌ను నష్టాల్లోకి నెట్టి ప్రైవేటీకరించడానికి రంగం సిద్ధం చేస్తున్నది. కార్మికుల జీతాలు సగానికి పైగా కోత పెట్టింది. 4 లేబర్ కోడ్ల పేరుతో 1955 నుంచి అమలు చేస్తున్న వేతన విధానాన్ని రద్దు చేసింది. కార్మిక వర్గం యజమానికి సేవ చేయడమే తమ పవిత్ర కర్తవ్యమని, ప్రతిఫలం ఆశించకుండా పని చేయాలనే విధానాన్ని 'శ్రమశక్తి నీతి' పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కార్మికుల వేతనాలు పెంచాలంటుంటే వారి ఉద్యమాలను అణచివేస్తున్నది. స్కీమ్ కార్మికులను కార్మికులుగా గుర్తించడంలేదు. వారి జీతాలు గొర్రె తోక బెత్తెడులా ఉన్నాయి. కార్మికులు జీవితమంతా పని చేసినా తాత్కాలిక ఉద్యోగులుగానే వుంటారు. దీనినే లేబర్ కోడ్‌లో ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ అంటారు. హైర్ అండ్ ఫైర్ ఉంటుంది. ఎందుకు ఉద్యోగం తొలగించారని అడగడానికి ఉండదు. కార్మికశాఖ ఉండదు. తనిఖీలుండవు. ట్రిబ్యునల్ పేరుతో లేబర్ కమిషనర్‌కు అపారమైన అధికారాలు వుంటాయి. యూనియన్లను నోటీసు లేకుండా రద్దు చేయవచ్చు. ఏడుగురు కార్మికులు కలిసి ట్రేడ్ యూనియన్ పెట్టుకొనే ప్రాథమిక హక్కు లేదు. సమ్మె హక్కు లేదు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్-19 రైట్ టు అసోసియేషన్‌కు పూర్తి విరుద్ధం. కార్మికులు సమ్మె చేస్తే జీతాల కోత, జైలు, జరిమానాలు వుంటాయి. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై మహత్తర పోరాటం చేయాలి. అందుకే ఇది సాధారణ సమ్మె కాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై సవాల్ చేసే సమ్మె. ప్రపంచ వ్యాపితంగా పెట్టుబడిదారీ విధానం చివరి దశలో ఉంది. 'క్రోనీ క్యాపిటలిజం' అత్యధిక లాభాలార్జించే ఉత్సాహంతో ఉంది. అమెరికన్ సామ్రాజ్యవాదం కయ్యానికి కాలు దువ్వుతున్నది. అత్యధిక దోపిడీకి వలస దేశాలను ఏర్పాటు చేయడమే మార్గమని రంకెలేస్తున్నది. భారతదేశంలో కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చి జలగల్లా రక్తాన్ని పీల్చడానికే ట్రంప్ టారిఫ్‌లు వచ్చాయి. భారత దేశాన్ని బలహీనం చేసి సార్వభౌమత్వాన్ని దెబ్బ తీస్తున్నది.

## డబ్బులు లేక బైక్ పైనే 10 కి.మీ మృతదేహాన్ని తీసుకెళ్లారు..!



**బాపట్ల, పతాకం న్యూస్:** ఆసుపత్రిలోని మృతదేహాన్ని తరలించడానికి కనీసం మహాప్రస్థానం వంటి వాహనాలు కూడా లేకపోవడం, ఆటోకు ఇవ్వడానికి డబ్బులు లేక బైక్ పైనే మృతదేహాన్ని 10 కిలో మీటర్లు తీసుకెళ్లిన ఘటన మంగళవారం కర్లపాలెం మండలంలో జరిగింది. కర్లపాలెం మండలం చింతయపాలెం పంచాయతీ రాళ్లచెరువుకు చెందిన నక్క నాగేశ్వరరావుకు గుండెనొప్పి వచ్చింది. వెంటనే వారి సోదరులు, కుటుంబీకులు కలిసి బైక్ పై బాపట్ల ఏరియా వైద్యశాలకు తీసుకుని వెళ్లారు. అక్కడికి తీసుకొని వెళ్ళేసరికి నాగేశ్వరరావు మృతి చెందారు. అయితే ఆటోలో మృతదేహాన్ని తరలించడానికి మూడు వేల రూపాయల వరకు అడగటంతో తమ దగ్గర అంత స్తోమత లేదని 10 కిలోమీటర్లు బైక్ మీదే మృతదేహాన్ని వారి గుడిసెలకు తరలించారు. ఇదంతా జరిగింది బాపట్ల జిల్లా కేంద్రానికి సమీపంలో 10 కిలోమీటర్ల దూరంలోనే కావడం విశేషం.

## మహాశివరాత్రికి 618 బస్సుల ఏర్పాటు



**నరసారావుపేట, పతాకం న్యూస్:** మహాశివరాత్రి సందర్భంగా పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల నుంచి కోటప్పకొండకు వచ్చే భక్తుల సౌకర్యార్థం 618 బస్సులు ఏర్పాటు చేస్తున్నామని డీపీటీవో టీ అజిత కుమారి తెలిపారు. సోమవారం నరసరావుపేటలోని జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక బస్సుల్లోనూ స్త్రీ శక్తి పథకం అమలవుతుందని వివరిం చారు. కోటప్పకొండ దిగువ నుంచి పైకి భక్తులను చేరవేసేందుకు 95 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. దీంతో పాటు నరసరావుపేట బస్టాండ్ నుంచి 213, చిలకలూరిపేట నుంచి 121, వినుకొండ నుంచి 50, అద్దంకి నుంచి 39, చీరాల నుంచి 50, ఒంగోలు నుంచి 50 బస్సులను సంస్థ ఏర్పాటు చేసిందన్నారు. అలాగే నరసరావుపేట డిపో పరిధిలో 1800 మంది, చిలకలూరిపేట డిపో పరిధిలో 750 మంది ఉద్యోగులు పనిచేస్తారన్నారు. కోటప్పకొండ, చిలకలూరి పేట, నరసరావుపేటలలో మొత్తం ఆరు ప్రత్యేక బస్‌స్టేషన్లు నిర్వహిస్తున్నామన్నారు. కోటప్పకొండ ఎగువకు, దిగువకు రాక పోకలు సాగించే బస్సులోనూ మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్టు చెప్పారు.

## 'నో దందా, నో చందా' అనే నినాదంతో ముందుకు వెళ్తున్నాం: సుజనా చౌదరి



**విజయవాడ, పతాకం న్యూస్:** తన నియోజకవర్గంలో 'నో దందా, నో చందా' అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి చెప్పారు. తన నియోజకవర్గానికి ఫస్ట్ ర్యాంక్ రావడం ఆనందంగా ఉందన్నారు. మొత్తం 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి ఫస్ట్ ర్యాంక్ రావడంపై ఎమ్మెల్యే సుజనా చౌదరి మంగళవారం స్పందించారు. ఈ నియోజకవర్గానికి తాను చేసింది తక్కువే అని.. చేయాల్సింది ఎక్కువే ఉందని తెలిపారు. నియోజకవర్గంలో చందా.. దందా లేకుండా దాదాపుగా నియంత్రించామని విశ్వాసం వ్యక్తం చేశారు. ర్యాంకింగ్ అనేది ప్రభుత్వ పథకాలు ఏ విధంగా అమలయ్యాయనే దాని మీద ఇచ్చారని ఎమ్మెల్యే సుజనా చౌదరి వివరించారు. ఎమ్మెల్యేగా తనకు కూడా ఫస్ట్ టైమ్ అని.. అలాగే నియోజకవర్గ ప్రజలంతా తనకు సహకరించారని సంతోషం వ్యక్తం చేశారు. కూటమిలోని మూడు పార్టీల వారు కలిసి పని చేశారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో.. తొలిసారిగా ఈ నియోజకవర్గంలో పర్యటించానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి గుర్తు చేశారు. ఆ తర్వాత నిరంతరం నియోజకవర్గంలో పర్యటిస్తూనే ఉన్నానని వివరించారు. ఈ నియోజకవర్గంలో తాను చేసింది 25 శాతం లేదా 30 శాతం మాత్రమేనని.. ఇంకా చేయాల్సింది 75 శాతం మిగిలి ఉందన్నారు. ఆ దిశగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా అన్నీ మనమే చేయలేమని.. డెలిగేట్ ద్వారా పని చేయించగలమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అనుసంధానం చేయడానికి ఎంత వీలు అయితే అంత చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఉన్న పథకాలు తీసుకొని.. ఇంకా చాలా వరకు మెరుగుపరిచామని వివరించారు. స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు ఏ విధంగా పెంచాలనే దిశగా ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా తన ఫోకస్ ప్రివెంటివ్ సిక్నెస్ మీదనేనని చెప్పారు. ఆ తర్వాత ప్రెగ్నెంట్ ఉమెన్.. పని మానేసి హాస్పిటల్స్ వెళ్లకుండా మెటర్నిటీ సెంటర్స్ పెడితే ఇంకా ఈజీగా ఉంటుందని చెప్పారు. దీంతో పాటు పాఠశాలలో మెరుగైన సౌకర్యాల కోసం.. ఎన్జీవోస్‌తో మాట్లాడి ఐవోటి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటివి ప్రవేశపెడతామన్నారు. ఆ తర్వాత మొబైల్ హెల్త్ వ్యాన్స్ పెట్టామని తెలిపారు. వీలైనంత వరకు తాను సుజనా ఫౌండేషన్ వారితో మాట్లాడానన్నారు. అందుకు డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, భాగ్యనగర్ గ్యాస్ తదితర సంస్థలు సహకరించాయన్నారు. మిగిలిన ఫార్మా కంపెనీలతో కూడా తాను కాంటాక్ట్ చేస్తూ ఉన్నానని చెప్పారు.

## శివరాత్రి నాటికి ఆలయాల్లో పటిష్ఠ చర్యలు తీసుకోండి: సీఎం చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** శ్రీశైలం సహా వివిధ శివాలయాల్లో భక్తుల రద్దీ, వసతులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం సమీక్ష నిర్వహించారు. శివారాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ, సౌకర్యాలపై మంత్రులు, ప్రధాన కార్యదర్శి, డీజీపీలతో పాటు ఇతర అధికారులతో ఢిల్లీ నుంచి సీఎం సమీక్షించారు. శివరాత్రి నాటికి ఆలయంలో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశమున్న నేపథ్యంలో పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీచేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, హోం మంత్రి అనిత.. ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాట్లు, వసతులపై అధికారులతో పర్యవేక్షించాలని సీఎం సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అలాగే, దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు త్వరితగతిన దర్శనం పూర్తయ్యేలా.. సరైన వసతి లభించేలా కార్యచరణ అమలు చేయాలని ఆదేశించారు. దీక్షలు, మాలధారణలతో ఎంతో కష్టపడి ఆలయానికి చేరుకునే భక్తులకు ఇబ్బంది కలిగేలా, అగౌరవపరిచేలా ఎవరూ వ్యవహరించకూడదని స్పష్టం చేశారు. రోజు రోజుకూ దేవాలయాల్లో పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చంద్రబాబు సూచించారు. శివరాత్రి పర్వదినం వంటి సందర్భాల్లో అన్ని విభాగాలు పూర్తి సమన్వయంతో పనిచేసేలా ఇప్పటి నుంచే పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు.

## రోడ్డున పడ్డామని గన్నవరం విమానాశ్రయానికి భూములు, ప్లాట్లు ఇచ్చిన రైతుల ఆవేదన



**గుంటూరు, పతాకం న్యూస్:** 'గన్నవరం విమానాశ్రయం విస్తరణ కోసం భూములు, ప్లాట్లు ఇచ్చి రోడ్డున పడ్డాం.. పదేళ్లుగా వేడుకుంటున్నాం.. ప్రభుత్వాలకు మాపైన చిన్నచూపు ఎందుకు..' అని బాధితులు వాపోయారు. మంగళవారం రాజధాని ప్రాంతం మందడంలో రైతుల వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించిన సమావేశంలో విమానాశ్రయం బాధితులు పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ .... గన్నవరంలో మూడు లే ఔట్ లలో ఇళ్ల నిర్మాణం కోసం కొనుగోలు చేసిన సుమారు 500 ప్లాట్లను విమానాశ్రయం విస్తరణ కోసం ప్రభుత్వానికి ఇవ్వడం జరిగిందని, బాధితులు గొలుసు భాస్కరరావు, పుష్ప చెప్పారు. 10 ఏళ్ళు గడిచినా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ప్లాట్లను నేటికీ కేటాయించలేదన్నారు. రాజధానిలో ప్లాట్లు ఇస్తామన్నారని, అది కూడా జరగలేదన్నారు. భూములు, స్థలాలు ఇచ్చిన వారిలో అనేకమంది చనిపోయారని, తమకు కూడా 60, 70 ఏళ్ళు వచ్చాయని, ఇంకెప్పుడు ఇళ్ళు కట్టుకుంటామని కన్నీళ్ల పర్యంతమయ్యారు. రిటైర్మెంట్ తరువాత ఇళ్లు కట్టుకోవాలని బ్యాంకుల్లో అప్పులు తెచ్చామని, ఇళ్ళు సమకూరలేదు గానీ బ్యాంక్ లో వడ్డీ మాత్రం కట్టాల్సి వస్తోందని బాధను వెలిబుచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. రాజధాని రైతుల సమస్యలను త్రిమెన్ కమిటీ పరిష్కరిస్తోందని, తమ సమస్యను కూడా పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని బాధితులు వేడుకున్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## బిల్లు పెట్టాలి: చంద్రబాబు

పోలవరం - నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు అంశంపై భేటీలో చర్చించారు. ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చి సాంకేతిక, ఆర్థిక సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటితోపాటు ఏపీ-ఒడిశా మధ్య వంశధార నీటి వివాదం పరిష్కరించాలని కోరారు. వంశధార నీటి వివాద ట్రైబ్యునల్ తుది నివేదిక గెజిట్‌లో ప్రచురించాలని, వంశధారపై నేరడి బ్యారేజ్ నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని కోరారు. గోదావరి జలాల పంపకంపై ఏపీ-తెలంగాణ మధ్య వివాదం కొనసాగుతోందని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. నదీ జలాల పంపకానికి గోదావరి నీటి వివాదాల ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలన్నారు. కృష్ణాపై ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపునకు కర్ణాటక చేపట్టిన చర్యలపై అభ్యంతరం తెలిపారు. ఆల్మట్టి ఎత్తు పెంపుతో ఏపీకి వచ్చే దిగువ జలాలపై తీవ్ర ప్రభావం ఉంటుందని సీఎం తెలిపారు. దిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరుగురు కేంద్రమంత్రులతో భేటీ అవుతున్నారు. ఇప్పటికే కేంద్రమంత్రులు సీఆర్ పాటిల్, అమిత్ షా చర్చలో పాల్గొన్న సీఎం నిర్మలా సీతారామన్, శివరాజ్‌సింగ్, అశ్వినీ వైష్ణవ్‌తో భేటీకానున్నారు. ఉదయం 9.30 గంటలకు జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఉదయం 11 గం.కు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పలు అంశాల గురించి సీఎం చర్చించారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో, మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌తో, సాయంత్రం 4 గంటలకు ఐటీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం చంద్రబాబు భేట అయ్యారు.

## తప్పుడు లెక్కలు: జగన్

విడుదల చేసిన లెక్కలు ప్రభుత్వ బూటకపు ప్రచారాన్ని బట్టబయలు చేశాయని తెలిపారు. గత రెండేళ్లలో రాష్ట్ర పన్నుల రాబడి వృద్ధి సగటున కేవలం 1.97 శాతంగా మాత్రమే ఉందని, ఇది దిగ్భ్రాంతికరమని అన్నారు. "11 శాతం పైగా జీఎస్‌డీపీ వృద్ధి సాధిస్తున్న రాష్ట్రంలో పన్నుల రాబడి 2 శాతం లోపు ఎలా ఉంటుంది? ఈ వింత గణాంకాలు చూసి ప్రపంచ ఆర్థికవేత్తలు కూడా ఆశ్చర్యపోతారు" అని జగన్ ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో, దేశంలోని 23 రాష్ట్రాలకు సంబంధించిన పన్నుల రాబడి వృద్ధిపై 'కాగ్' విడుదల చేసిన గణాంకాలను జగన్ ప్రస్తావించారు. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ అట్టడుగు నుంచి రెండో స్థానంలో, అంటే 22వ ర్యాంక్‌లో నిలవడం సిగ్గుచేటని అన్నారు. ఇదే చంద్రబాబు '22వ ర్యాంక్ విజన్' అంటూ ఆయన సెటైర్లు వేశారు. చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ఏదైనా విషయంలో మొదటి స్థానంలో ఉందంటే అది అప్పులు, అవినీతి, రాజకీయ కక్ష సాధింపులు, తప్పుడు ప్రచారంలో మాత్రమేనని జగన్ తీవ్రంగా విమర్శించారు.

# రూ.7 వేల కోట్ల రూపాయలు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని విద్యార్థుల ర్యాలీ




**కాకినాడ, పతాకం న్యూస్:** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ) ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. పెండింగ్ లో ఉన్న ఏడు వేల కోట్ల రూపాయలు బకాయి ఫీజు రీయింబర్స్మెంట్ డబ్బులను విడుదల కోసం విద్యార్థులు జిల్లా పరిషత్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా తరలి వచ్చి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సి.హెచ్ లోవరాజు, ఎం.గంగా సూరిబాబు మాట్లాడుతూ .... కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేస్తామని చెప్పి ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మాట మరిచిందన్నారు. 7 వేల కోట్లు రూపాయలు ప్రభుత్వం బకాయిలు పెట్టిందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్మెంట్ డబ్బులు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయని, పరీక్షలకు అనుమతించబోమని విద్యార్థులను బెదిరించి విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తుందని వారు ఆరోపించారు. రేపు జరగబోయే బడ్జెట్ సమావేశాలలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ అంశంపై చర్చించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడంతో కళాశాలలు విద్యార్థులలే ఫీజు రియంబర్స్మెంట్ డబ్బులు చెల్లించాలని లేకపోతే పరీక్షలకు అనుమతి ఇవ్వబోమని అంటున్నారన్నారు. చిన్న చిన్న బడ్జెట్ కళాశాలలు కూడా నిర్వహణ అగమ్యగోచరంగా ఉంటుందన్నారు. తక్షణమే ప్రభుత్వ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులందరినీ ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాడతామన్నారు. అనంతరం సమ్యసలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి కి ఎస్ ఎఫ్ ఐ బఅందం ఇవ్వడం జరిగింది. దీనిపై కలెక్టర్ షాన్ మోహన్ స్పందించి ప్రభుత్వానికీ తెలియజేస్తామని అన్నారన్నారు. జిల్లాలో ఏ కళాశాల కూడా విద్యార్థుల హాలు టికెట్లు, సర్టిఫికెట్లు అంపకుండా చూస్తామన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ జిల్లా, నగర నాయకులు సంజరు, సాహిత్, జైరామ్, అమృత, నాని, సత్యం, రాజు, గమినివేలు, ఆదర్శ, విద్యార్థులు పాల్గొన్నారు.

# 12న సమ్మెలోకి సీపీఐ శ్రేణులు




- **14న మెడికల్ మాఫియాపై రాష్ట్ర వ్యాప్త ఆందోళన**
- **సీపీఐ జాతీయ సమితి సభ్యులు జె వి సత్యనారాయణ మూర్తి**

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** భారత కార్మికవర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను సమూలంగా నాశనం చేసిన మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లుగా అమలు చేయనుండడాన్ని సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు ఆ పార్టీ జాతీయ సమితి సభ్యులు జె వి సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. మంగళవారం విశాఖ అల్లిపురంలో గల సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెట్టుబడాదారులకు రక్షణగానే నాలుగు లేబర్ కోడ్లు రూపొందాయని అన్నారు. ఈ కోడ్స్ అమలైతే కార్మికులకు ఉద్యోగ భద్రతకు అవకాశమే ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. సమ్మె హక్కును కూడా కోల్పోతారని పేర్కొన్నారు. పని గంటల పెరిగి ప్రభుత్వ పర్యవేక్షణ లేకుండ పోతుందని తెలిపారు. ప్రైవేటు యాజమాన్యాలదే ఇష్టారాజ్యం అవుతుందని పేర్కొన్నారు. ఇందుకోసమే మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతిఏటా తప్పకుండా నిర్వహించాల్సిన భారత కార్మిక సదస్సుల నిర్వహణను పూర్తిగా నిలిపివేసిందని గుర్తు చేశారు. ఈ తరుణంలో లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలనే ప్రధానమైన డమాండుతో అన్ని కేంద్ర కార్మిక సంఘాలు ఒకేతాటిపైకి వచ్చి ఫిబ్రవరి 12న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునకు సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటించిన పార్టీ శ్రేణులు ప్రత్యక్షంగా పాల్గొంటున్నట్టు వెల్లడించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కమ్యూనిజంపై చేసిన వ్యాఖ్యల్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను భౌతికంగా లేకుండా చేయవచ్చేమో గానీ ఆ భావజాలానికి మూలమైన మార్క్సిజాన్ని ఎవరూ ఏమీ చేయలేరని పేర్కొన్నారు. భారత దేశంలో కమ్యూనిజాన్ని లేకుండా చేయాలను కోవడం ఆయన మూర్కత్వమేనని చురకలంటించారు. కమ్యూనిజం అజరామతరమైన సిద్ధాంతమని దాన్ని మీలాంటి వారెవ్వరూ ఏమి చేయలేరని స్పష్టం చేశారు. అమెరికా నడిబొడ్డునే జోహ్రాన్ మంమ్దానీ రూపంలో సోషలిస్టులు జండా ఎరుగవేశారని గుర్తు చేశారు. దేశంలో మెడికల్ మాఫియా కారణంగా ప్రజలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మోదీ అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలను ఏపీలోని చంద్రబాబు కూటమి ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తోందని ఆక్షేపించారు. ఇందులో భాగంగానే ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ పేరుతో ప్రైవేటుకు ఇవ్వాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పేదలకు మెరుగైన వైద్యం అందడం లేదని, ప్రైవేటు ఆసుపత్రులు దోపిడీకి అడ్డుకట్టలేకుండా పోయిందని పేర్కొన్నారు. మెడికల్ మాఫియాలను పెంచి పోషిస్తున్న ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆ నెల 14 న సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చినట్టు పేర్కొన్నారు. ఇక ఏపీలో తిరుమల లడ్డు విషయంలో పాలక ప్రతిపక్షాల మధ్య సాగుతున్న వైరం భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బ తీస్తున్నదని పేర్కొన్నారు. పాలకులే పనిగట్టుకుని లడ్డు అంశాన్ని నిత్యం వివాదాస్పదం చేస్తుండడాన్ని ఆక్షేపించారు. లడ్డు కల్తి వ్యవహారంలో దర్యాప్తు సంస్థలకు స్వేచ్ఛనిచ్చి నివేదికల ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. అంతే తప్ప రాజకీయ లబ్ది కోసం తిరుమల లడ్డును రాజకీయం చేయడం మానుకోవాలని చంద్రబాబు ప్రభుత్వానికి హితవు పలికారు. విశాఖ నగరంలోని అంతర్గత రహదారులను పీపీపీ పద్ధతుల్లో ప్రైవేటకు ఇవ్వాలని జీవీఎంసీ ప్రతిపాదనను తీవ్రంగా తప్పుబట్టారు. రోడ్ల కోసం పెట్రోలు, డీజిల్, వాహనాల కొనుగోలు తరుణంలో ఇప్పటికే అనేక విధాల పన్నులు వేస్తున్న ప్రభుత్వం నగరంలోని రహదారులను కూడా ప్రైవేటు వారికి ఇచ్చి దోపిడీ చేసుకునేలా ఒప్పందాలు చేస్తే చూస్తూ ఊరుకోమని ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ రహిమాన్, కార్యవర్గ సభ్యులు ఎం పైడిరాజు, ఎం మన్మధరావు, సిఎన్ క్షేత్రపాల్ రెడ్డి, ఎం మన్మదరావు, ఎన్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# తొమ్మిదిమంది పేకాటరాయుళ్లు అరెస్ట్

**బాపట్ల, పతాకం న్యూస్:** కర్లపాలెం మండలం పరిధిలోని డంపింగ్ యార్డ్ ప్రాంతంలో అక్రమంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్సై రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది మంగళవారం మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో మొత్తం తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. దాడి సమయంలో నిందితుల వద్ద నుంచి రూ.1,02,150 నగదు, 9 మొబైల్ ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఎస్సై రవీంద్ర మాట్లాడుతూ .... డంపింగ్ యార్డ్ పరిధిలో పేకాటలు జరుగుతున్నాయన్న సమాచారంతో తమ సిబ్బందితో నిఘా పెంచి, పక్కా సమాచారంతో దాడి చేసినట్లు వెల్లడించారు. పేకాట ఆడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తూ, అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై రవీంద్ర హెచ్చరించారు.

# డీసీసీ బ్యాంకులో దొంగతానికి ప్రయత్నించిన వ్యక్తిని అరెస్ట్ చేసిన దేవరాపల్లి పోలీసులు



- **నాలుగు రోజులు వ్యవదలోనే దొంగను చేదించిన దేవరాపల్లి ఎస్సై సత్యనారాయణ టీం**
- **నాలుగు టీములుగా దొంగను చేదించిన దేవరాపల్లి పోలీసులు**

**దేవరాపల్లి, ,పతాకం న్యూస్:** దేవారపల్లి మండల పోలీస్ స్టేషన్,అనకాపల్లి జిల్లా 06.02.2026 అర్ధరాత్రి దేవరాపల్లి ఇరిగేషన్ బంగ్లా పక్కన ఉన్న డిసిసి బ్యాంక్ నందు దొంగతనం చేయటానికి వచ్చి ప్రయత్నం చేసిన వ్యక్తిపై ఈనెల 6,2,2026తేదీన బ్యాంకు మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవరాపల్లి ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దేవరాపల్లి ఎస్ఐ, అనకాపల్లి డిఎస్పి ఎం.శ్రావణి ఆదేశాల మేరకు చోడవరం సిఐ అప్పలరాజు ఆధ్వర్యంలో నాలుగు టీములుగా దేవరాపల్లి సిబ్బందిని విడదీసి సీసీ ఫుటేజ్ లో లభించిన ఫొటోస్ ని ఒక్కొక్కరికి చూపించుకుంటూ వివిధ ఏరియాల్లో తిరుగుతుండగా నిందితుని యొక్క ఆచూకిని ఆదివారం దేవారపల్లిలో కొంతమంది వ్యక్తులు గుర్తించి అనంతగిరి మండలం పినకోట, ఏజెన్సీ ఏరియా వ్యక్తిగా గుర్తించారు. దేవరాపల్లి ఎస్సై సమాచారాన్ని రాబెట్టుకొని మంగళవారం ఉదయం 10 గంటలకు తనకు వచ్చిన ఖచ్చితమైన సమాచారం మేరకు దేవరాపల్లి నుంచి వాలబు గ్రామ బ్రిడ్జి రోడ్ లో ఉన్నటువంటి శారదనది బ్రిడ్జిపై వాహనాలు తనిఖీ చేస్తూ ఉండగా జీనబాడు వైపు నుంచి వస్తున్నటువంటి నిందితుడిని చూసి సిసి ఫుటేజ్ లో ఉన్న వ్యక్తిగా గుర్తించి అరెస్టు చేసారు.పంది ప్రభాస్ తండ్రి సన్నీబాబు,20 సంవత్సరాలు గల గిరిజన యువకుడు,మొదట బ్యాంకు వెనుక భాగం వైపు వచ్చి ప్రహరీ గోడ ద్వారా బ్యాంకు లోని ప్రవేశించాడు,ఆసమయంలో సిసి ఫుటేజ్ లో అతని మొఖం పడిందని గుర్తించి తన నడుముకున్నటువంటి పింక్ కలర్ స్వెటర్ను తలపై నుంచి పూర్తిగా వేసుకొని ముఖం కవర్ చేసి బ్యాంకు ముందు భాగానికి బాత్రూం పక్కకు వచ్చి అన్ని విధాలుగా చూసుకొని ఎవరు లేరు అని నిర్ధారించుకున్న తర్వాత బ్యాంకుకు తూర్పు వైపు నుండి లైట్ ని ఆపేసి, మరల వెనక్కి వెళ్లి అక్కడ వెనుక వైపు ఉండే కిటికీ గ్రిల్ ని దొంగతనానికి ఉపయోగించే ఐరన్ రాడ్ తో కిటికీ గ్రిల్ తొలగించి అందులో నుండి బ్యాంకు లోపల ప్రవేశించి అన్ని సరుగులు,క్యాష్ కౌంటర్ ని ఓపెన్ చేసి డబ్బులు కనపడకపోవడంతో లాకరని ఓపెన్ చేయటానికి ప్రయత్నించి ఆ పని అవ్వకపోవడంతో సఫలీకృతశీ చెంది,మరల ఆ కిటికీ గ్రిల్ ద్వారా బయటికి వచ్చినట్టు సిసి ఫుటేజ్ లో కనబడింది. ఇంక ఈ పని జరగదని నిర్ధారణ చేసుకొని తన సొంత గ్రామమైన పినకోట వైపు వెళ్లిపోయాడు అని దేవరాపల్లి ఎస్సై అన్నారు దేవరాపల్లి కాంప్లెక్స్ కు అతి సమీపంలో ఉన్నటువంటి డిసిసిబి బ్యాంకులో చోరీయత్నం జరిగిన కొద్ది రోజుల్లోనే సిసి ఫుటేజ్ ఆధారంగా ముద్దాయిని పట్టుకున్న కోటపాడు ఇంచార్జ్ సీఐ, చోడవరం సీఐ అప్పలరాజు దేవారపల్లి ఎస్సై సత్యనారాయణను పోలీస్ సిబ్బందిని అనకాపల్లి డి.ఎస్.పి ఎం.శ్రావణి అభినందించారు.మండలంలో ముఖ్యమైన కూడలిలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని అనకాపల్లి డిఎస్పి ప్రకటన చేశారు అనకాపల్లి జిల్లాలో అన్నీ బ్యాంకులు వారు కిటికీలను,ప్రధాన ద్వారాలు వాటి యొక్క తలుపులను కట్టు దిట్టం చేసుకోవాలి అలాగే ప్రతి బ్యాంకు నందు అలారం సిస్టమును ఏర్పాటు చేసుకొని అది ఎప్పటికప్పుడు పనిచేస్తున్నది లేనిది తనిఖీ చేయవలిసినదిగా విజ్ఞప్తి చెయడమైనది

# ఆధార్ సేవల విస్తరణకు చర్యలు



**పాడేరు, పతాకం న్యూస్:** మన్యంలో ఆధార్ సేవలను మరింతగా విస్త రించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ తెలిపారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఏజెన్సీలో ఆధార్ సేవలను విస్తరించాలనే లక్ష్యంతో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 150 మొబైల్ ఆధార్ కిట్‌లను సమకూర్చామన్నారు. వాటి ద్వారా అన్ని ప్రాంతాల్లోనూ ప్రజలకు అవసరమైన ఆధార్ సేవలను అందిస్తామన్నారు. భవిష్యత్తులో ఆధార్ కార్డులు లేని పౌరులుండకుండా చర్యలు చేపడతామన్నారు. ప్రజలు తమ ఆధార్ కార్డుల నమోదు, మార్పులు, చేర్పులు వంటి ప్రక్రియల కోసం ఆధార్ నమోదు సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, పరిపాలనాధికారి ఎం.హేమలత, పీఎంవో ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ ఆఫీసర్ రాంగోపాల్, అడిషనల్ పీఐవో రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

# అవకాశాలను సృష్టించుకునే స్థాయికి ఎదగడమే నాయకత్వం: భాగ్యలక్ష్మి





**మల్కాపురం, పతాకం న్యూస్:** వచ్చిన అవకాశాలను వదులుకునే స్థాయి నుంచి అవకాశాలను సృష్టించుకునే స్థాయికి ఎదగడమే నాయకత్వం అని, అందుకు ప్రతి విద్యార్థి ప్రయత్నించాలని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక శ్రీహరిపురంలోని భాష్యం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించిన చిన్నారుల గ్రాడ్యుయేషన్ ఉత్సవానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరై, మాట్లాడుతూ- చిన్నారులు క్రమశిక్షణతో, పట్టుదలతో సాధించిన విజయానికి ఈ ఉత్సవం ఒక ప్రతీక అని అన్నారు. కార్యక్రమానికి భాష్యం ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపల్ శ్రీమతి హరీష అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో భాష్యం ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ వంశీ రామ్ గౌరవ అతిథిగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు కాన్వకేషన్ పద్ధతిలో ప్రశంసా పత్రాలను భాగ్యలక్ష్మి చేతులమీదుగా అందజేశారు.ఈ ఉత్సవంలో భాష్యం స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం స్థానికులను, తల్లిదండ్రులను విశేషంగా ఆకర్షించింది.

# చెత్త రహిత గ్రామాలే లక్ష్యం: అయ్యన్న




**నర్సీపట్నం, పతాకం న్యూస్:** గ్రామాలను చెత్త రహితంగా తీర్చి దిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. నర్సీపట్నం మండలానికి కేటాయించిన స్వచ్ఛరథాన్ని ఆయన ఇక్కడ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్, ఇనుము, పేపర్లు, ఇతర పొడి వ్యర్థాలను ప్రజలు ఎక్కడపడితే అక్కడ పారేయవద్దని సూచించారు. వీటిని ఇళ్లల్లో భద్రపరిచి, స్వచ్ఛరథం వచ్చినప్పుడు అందజేయాలని, వీటి విలువకు సరిపడ వివిధ రకాల నిత్యావసర సరుకులు పొందువచ్చని చెప్పారు. ప్రజలంతా స్వచ్ఛ రథం సేవలను వినియోగించుకొని, గ్రామాలను పరిశుభ్రంగా వుంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# గిరి రైతుల ఆదాయాభివృద్ధికి ప్రత్యేక చర్యలు



**పాడేరు ,పతాకం న్యూస్:** గిరిజన రైతుల ఆదాయాన్ని అభివృద్ధి చేసేందుకు, గిరిజన ఉతప్త్రబీపత్తుల అభివృద్ధి, బ్రాండింగ్, మార్కెటింగ్‌పై అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. గిరిజన ప్రాంతంలో పండే కాఫీ, మిరియాలు, పసుపు పంటలను మరింతగా ప్రమోట్ చేయాలని, ప్రపంచ ఖ్యాతిగాంచిన అరకు కాఫీ, నాణ్యమైన మిరియాల సాగును మరింతగా విస్తరించాలని, తర్వాత గిరిజన రైతుల ఆదాయం పెరగాలన్నారు. గిరిజన ఉత్పత్తులకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకు రావడమే కాకుండా వాటిని పండించే రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు చేపట్టాలన్నారు. చింతపల్లి మండలం లంబసింగి ప్రాంతంలో కుంకుమ సాగుకు అనుకూలతపై కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్‌తో సీఎం చంద్రబాబునాయుడు చర్చించారు. అక్కడ వాతావరణ పరిస్థితులు, సాగు ప్రక్రియలపై పైలట్ ప్రాజెక్టుగా ప్రయోగత్మకంగా కుంకుమ పువ్వు సాగు చేపట్టాలన్నారు. దానిని విజయవంతం చేసి కుంకుమపువ్వు సాగుతో గిరిజనులకు ఉపాధి, ఆదాయం సమకూరాలన్నారు. క్షేత్ర స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షించి, పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యాన పంటల అభివృద్ధిలో బి- గ్రేడులో ఉన్నామని, అవసరమైన చర్యలు చేపట్టి, ఏ-గ్రేడు సాధిస్తామని, అల్లూరి, పోలవరం జిల్లాల్లో 40 వేల ఎకరాలు గడ్డి ఉన్న ప్రాంతముందని, దానిని వినియోగించి ఉద్యాన పంటల సాగులో ప్రగతి సాధిస్తామని చెప్పారు. అలాగే కాఫీ తోటల అభివృద్ధికి జాతీయ ఉపాధి హామీ పథకంలో అనుసంధానానికి అనుమతులు కావాలని కలెక్టర్ కోరగా, సీఎం సానుకూలంగా స్పందించి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో చర్చించి చర్యలు చేపడతామన్నారు. జిల్లాలో సీసీ రోడ్లు, గోకులాల షెడ్‌లు, తదితర నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు.

### ఆస్తి పన్ను బకాయిల వసూలు కోసం దూకుడు పెంచిన
# జీవీఎంసీ రెవెన్యూ అధికారులు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఆస్తి పన్ను బకాయిల వసూలు దిశగా జీవీఎంసీ రెవెన్యూ అధికారులు దూకుడుపెంచారు. మొండి బకాయిలను రాబట్టేందుకు కఠిన చర్యలకు దిగుతున్నారు. ముందుగా బకాయిదారులకు నోటీసులు జారీచేస్తున్నారు. వారి నుంచి స్పందన రాకపోతే పన్ను బకాయి ఉన్న ఆస్తులు వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేస్తున్నారు. అప్పటికీ పన్ను బకాయిలు చెల్లించకపోతే సీజ్ చేస్తున్నారు.జీవీఎంసీ పరిధిలో 6,02,937 ఆస్తి పన్ను అసెస్‌మెంట్‌లు ఉన్నాయి. వీటి ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.566.41 కోట్లు వసూలు కావాల్సి ఉండగా, ఇప్పటివరకూ రూ.360 కోట్లు వసూలైంది. మిగిలిన మొత్తంలో చాలావరకూ మొండి బకాయిదారులే ఉండడంతో వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. దీంతో రెవెన్యూ విభాగం డిప్యూటీ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బకాయిదారులకు నోటీసులు ఇచ్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. జీవీఎంసీ పరిధిలో సుమారు 1,36,149 మంది బకాయిదారులు ఉన్నట్టు గుర్తించడంతో వారందరికీ జప్తు నోటీసులు జారీచేయాలని అన్ని జోన్‌ల కమిషనర్లను ఆదేశించారు. ఇప్పటివరకూ 1,10,136 మందికి నోటీసులను అందజేశారు. అయినప్పటికీ వారి నుంచి సరైన స్పందన రాకపోవడంతో వారి ఆస్తుల వద్ద అందరికీ కనిపించేలా వారి పన్ను బకాయి వివరాలను తెలియజేస్తూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేస్తున్నారు. అప్పటికీ బకాయిలు చెల్లించడానికి ముందుకురాకపోతే వారి ఆస్తులను సీజ్ చేస్తున్నారు. మధురవాడ జోన్ ఐదో వార్డు పరిధిలో యునైటెడ్ టెలికామ్స్ లిమిటెడ్ సంస్థ గత మూడు ఆర్థిక సంవత్సరాల నుంచి పన్ను చెల్లించకపోవడంతో రూ.87,74,916 బకాయి ఉండిపోయింది. వారికి జప్తు నోటీసు ఇచ్చినా స్పందించకపోవడంతో సోమవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. అలాగే గాజువాక జోన్ 57వ వార్డు పరిధిలో ఆకాశం అమ్ములు అనే అమ్మన్న అనే సంస్థ గత ఐదు సంవత్సరాల నుంచి పన్ను చెల్లించకపోవడంతో రూ.63,28,485 బకాయి పడింది. దీంతో ఆ సంస్థ ముందు హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. నార్త్ జోన్ పరిధి 49వ వార్డులో ఐ.భాస్కరరావు అనే వ్యక్తి గత తొమ్మిది ఆర్థిక సంవత్సరాల నుంచి ఆస్తి పన్ను చెల్లించకపోవడంతో రూ.1,51,166 బకాయి ఉంది. అక్కడ కూడా హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. జప్తు నోటీసులకు స్పందించని వారి ఆస్తుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసే ప్రక్రియ కొనసాగుతోంది. హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేసిన తర్వాత కూడా పన్ను చెల్లించని వారి ఆస్తులను సీజ్ చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కమిషనర్ కేతన్‌గార్గ్ పన్ను వసూళ్ల పట్ల సీరియస్‌గా వ్యవహరిస్తుండడంతో బకాయిదారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి.

## చెత్త సమస్యకు పరిష్కారం ఏది?



**అనకాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి పట్టణంలో చెత్త సమస్యకు పరిష్కారం లభించేలా లేదు. పాలకులు మారుతున్నా డంపింగ్‌యార్డు కోసం స్థల సేకరణ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. దీంతో తీవ్ర దుర్గంధం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో నిత్యం టన్నుల కొద్దీ వెలువడుతున్న చెత్తను ప్రత్యేకంగా ఊరికి దూరంగా డంపింగ్ యార్డును ఏర్పాటు చేసి తరలించాల్సి ఉండగా దశాబ్దాల కిందట నుంచి జీవీఎంసీ జోనల్ కార్యాలయ ఆవరణలోనే చెత్తను నిల్వ చేస్తూ డంపింగ్‌యార్డుగా మార్చేశారు. వర్షాకాలంలో ఈగలు, దోమలు ముసురుకుంటున్నాయి. ఎండాకాలం వచ్చిందంటే చాలు చెత్త గుట్టల నుంచి వెలువడే దుర్వాసనతో పరిసరాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పరిసరాల్లో ప్రజలు తరచూ అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో 65 వేలకు పైగా కుటుంబాల నుంచి రోజుకు 50 నుంచి 80 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. జీవీఎంసీ అధికారులు రెండు లారీల్లో చెత్తను విశాఖపట్నం జిల్లా మధురవాడకు సమీపంలోని జిందాల్‌కు చెందిన చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రానికి తరలిస్తున్నారు. కేవలం రెండు వాహనాల్లో మాత్రమే చెత్తను తరలిస్తుండడంతో ప్రతి రోజు వస్తున్న చెత్తతో డంపింగ్‌యార్డులో దాదాపు సగం చెత్త గుట్టలుగా పేరుకుపోతోంది. దశాబ్ద కాలంగా పట్టణంలో దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఆవరణలోని డంపింగ్‌యార్డును పట్టణ శివారు ప్రాంతానికి తరలించాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నా, పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో డంపింగ్ యార్డుకు స్థలాన్ని కేటాయిస్తామని అప్పటి పాలకులు హడావిడి చేసినా ఆచరణకు నోచుకోలేదు. ఐదేళ్లలో కనీసం స్థలాన్ని సేకరించలేకపోయారు. గతంలో శారదా కాలనీలో డంపింగ్ యార్డు కోసం ఒక స్థలాన్ని, అదే విధంగా అచ్చెయ్యపేటలో మరో స్థలాన్ని పరిశీలించినా స్థానికులు అభ్యంతరం చెప్పడంతో అధికారులు వెనకడుగు వేశారు. తరువాత డంపింగ్‌యార్డు ఏర్పాటు ఊసెత్తడం లేదు. గత సార్వత్రిక ఎన్నికల ముందు ప్రస్తుత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అనకాపల్లి పట్టణ నడిబొడ్డున ఉన్న డంపింగ్ యార్డును పరిశీలించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇబ్బందికరంగా మారిన డంపింగ్ యార్డును ఇక్కడ నుంచి తరలిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు డంపింగ్ యార్డు ఏర్పాటు విషయంపై జీవీఎంసీ అధికారులతో చర్చించిన దాఖలాలు లేవని ప్రజలు విమర్శిస్తున్నారు. కనీసం స్థలాన్ని కేటాయించేందుకు ప్రయత్నాలు జరగడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి జీవీఎంసీ కార్యాలయ ఆవరణలో ఉన్న డంపింగ్ యార్డును వేరొకచోటుకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# పాల వ్యాన్‌లో రేషన్ బియ్యం తరలింపు.. కేసు నమోదు





**తిరుపతి, పతాకం న్యూస్:** రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ముఠా గుట్టును తిరుపతి పోలీసులు రట్టు చేశారు. చంద్రగిరి మండలం గాదంకి టోల్ ప్లాజా వద్ద మంగళవారం పోలీసులు చేపట్టిన తనిఖీల్లో.. పాల వ్యాన్‌లో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి వ్యాన్ డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. తిరుపతి నుంచి కర్ణాటకకు ఈ బియ్యాన్ని తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. బియ్యంతో సహా వాహనాన్నీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం సుమారు 5 టన్నులు ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఈ వ్యవహారం వెనుక ఉన్నవారిని పట్టుకునేందుకు దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. అయితే.. తిరుపతి పరిసర ప్రాంతాల నుంచి ఎర్రచందనం, కలప తదితర వస్తువులను అక్రమంగా పెద్దఎత్తున తరలిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలు కీలక ప్రాంతాలు సహా రాష్ట్ర సరిహద్దుల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు.

## రూఫ్‌టాప్ సోలార్ అమరికలో ఇబ్బందులు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టు'ల ఏర్పాటులో జాప్యం జరుగుతోందని, ఇబ్బందులు ఎదురవుతున్నాయని వినియోగదారులు పలువురు ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌కు ఫిర్యాదు చేశారు. ఏపీఈపీడీసీఎల్ నూతనంగా ప్రారంభించిన 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమానికి తొలిరోజు 48 మంది వినియోగదారులు ఫోన్ చేసి పలు అంశాలపై ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడిలో ఎడతెగని జాప్యం, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు అంచనాలు ఇవ్వడంలో ఇక్కట్లు, విద్యుత్ లైన్ల మార్పు, స్తంభాల మార్పిడి, వేలాడుతున్న విద్యుత్ వైర్లు, సరఫరాలో అంతరాయాలు వంటి అంశాలపై ఫిర్యాదు చేశారు. సీఎండీ పృథ్వీతేజ్ ఫిర్యాదులన్నీ నమోదు చేసుకున్నామని, త్వరితంగా వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. వీటన్నింటినీ కార్పొరేట్ కార్యాలయం పర్యవేక్షిస్తుందన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమం కోసం వేచి ఉండాల్సిన అవసరం లేదని, సమస్య వచ్చిన వెంటనే 1912కు ఫోన్ చేసి చెప్పవచ్చునని, లేదంటే 9493681912 వాట్సాప్ నంబరుకు చాటింగ్ ద్వారా తెలియజేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సూర్యప్రకాశ్, టి.వనజ, ఎస్.హరిబాబు, సీజీఎం విజయలలిత, జీఎం ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ పరిధిలో గ్రామీణ ప్రాంతాల్లో ఛిద్రమై, అధ్వానంగా మారిన రోడ్లకు దశ మారనున్నది. మహర్దశపట్టింది. ఏపీ రూరల్ రోడ్స్ స్ట్రెంథనింగ్ ప్రాజెక్టు(ఏపీఆర్ఆర్ఎస్‌పీ) కింద విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పరిధిలో మొత్తం 98 రహదారులను అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. మొత్తం 267.68 కి.మీ.ల పొడవైన రహదారులను పటిష్టం చేయడానికి రూ.117.08 కోట్లు మంజూరుచేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. త్వరలో టెండర్ల ప్రక్రియను చేపట్టి, ఆరు నెలల్లో పనులు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. గత వైసీపీ ఐదేళ్ల పాలనో గ్రామీణ రహదారులు ఎంత అధ్వానంగా వున్నాయో అందరికీ తెలిసిందే. ఒక్క ఏడాది కూడా నిర్వహణ, అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకపోవడంతో క్రమేపీ గోతులు పెద్దవై, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. రహదారులపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి, వర్షం కురిస్తే నీరు నిలిచిపోయి పంట కుంటలను తలపించాయి. కొన్ని మార్గాల్లో రాళ్లు లేచిపోయి కనీసం నడిచి వెళ్లడానికి కూడా వీలు కాని విధంగా రహదారులు వుండేవి. రోడ్లను బాగు చేయించాలని ప్రజలు ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా.. నాటి వైసీపీ పాలకులు పెడచెవిన పెట్టారు. ఏడాదిన్నర క్రితం కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రహదారుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. స్థానిక ఎమ్మెల్యేలు ఇచ్చిన ప్రతిపాదనల మేరకు కేంద్రం ఇచ్చే గ్రాంట్లతోపాటు రాష్ట్ర ప్రభుత్వం మరికొంత నిధులు సమకూర్చనున్నది. దీనిలో భాగంగానే ఏపీ రూరల్ రోడ్స్ స్ట్రెంథనింగ్ ప్రాజెక్టు (ఏపీఆర్ఆర్ఎస్‌పీ) కింద పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ప్రాజెక్ట్సు డివిజన్ పరిధిలోని విశాఖపట్నం జిల్లాలో 17 రోడ్లు, అనకాపల్లి జిల్లాలో 81 రోడ్లు వున్నాయి. మొత్తం 267.68 కి.మీ.ల పొడవైన 98 రహదారులకు అభివృద్ధి/ మరమ్మతు పనులకు రూ.117.08 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం మూడు రోజుల క్రితం ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో అనకాపల్లి జిల్లాలో 226.40 కి.మీ.ల పొడవైన రోడ్లకు రూ.99.63 కోట్లు, విశాఖ జిల్లాలో 41.28 కి.మీ.ల పొడవైన రోడ్లకు రూ.17.45 కోట్లు కేటాయించారు. త్వరలో టెండర్లు పిలిచి, ఆరు నెలల్లో పనులు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

## భక్తులకు మెరుగైన సేవలు



**సింహాచలం, పతాకం న్యూస్:** ప్రజాప్రతినిదులు, సిబ్బంది సమష్టి కృషితో అప్పన్న ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సేవలను అందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటానని సింహాచలం ఈవో జె.వెంకటరావు అన్నారు. పూర్వపు ఈవో, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ నున్న సుజాత నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ త్వరలో జరగనున్న చందనోత్సవం, వార్షిక తిరుకల్యాణోత్సవాలపై ప్రత్యేక శ్రద్ధ పెడతామన్నారు. ప్రముఖులకు ప్రాధాన్యత ఇస్తూనే సాధారణ భక్తులందరికీ అప్పన్న నిజరూప దర్శనం లభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉత్సవాల విజయవంతానికి ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. సాధారణ రోజుల్లోనూ భక్తులకు మరిన్ని మెరుగైన సేవలు అందిస్తామని, ఆలయ ఆచార, సంప్రదాయలను గౌరవిస్తూనే అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. దాతలు విరాళాలుగా అందజేసిన స్వామివారి ఆస్తుల పరిరక్షణపై శ్రద్ధ పెడతామన్నారు. తొలుత సతీసమేతంగా ఆలయానికి చేరుకున్న ఈవో వెంకటరావుకు ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు, సీతారామాచార్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకున్న ఈవో గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో పూజల అనంతరం పండితులు చతుర్వేద స్వస్తి వచనాలతో ఆశీర్వచనాలీయగా, అధికారులు శాలువతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు.

### చిరు వ్యాపారులకు
# ప్రత్యామ్నాయం చూపాలి




**పార్వతీపురం, పతాకం న్యూస్:** మక్కువ మండల కేంద్రమైన మక్కువలో చేపడుతున్న ప్రధాన రోడ్డు వెడల్పు పనుల్లో సమన్యాయం పాటిం చాలని, ప్రభుత్వ స్థలాలను కాపాడాలని, వ్యాపారాలు దెబ్బతింటున్న చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ భరత్ కుమార్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, కార్యదర్శి వర్గసభ్యులు ఎన్‌వై నాయుడు వినతిని అందజేశారు. అనంతరం గంగునాయుడు మాట్లాడుతూ మజ్జి గౌరమ్మ గుడి నుంచి గోముఖీనది బ్రిడ్జి వరకు సుమారు 1.8 కిలోమీటర్లు రహదారికి రూ.2.65 కోట్లు మంజూరయ్యాయని మంత్రి సంధ్యారాణి పనులకు శంకుస్థాపన చేసిందనకు అభినందనలు తెలుపుతున్నామని అన్నారు. ఇదే సందర్భంలో రోడ్డు వెడల్పులో సమన్యాయం పాటించాలని కోరారు. మక్కువ-చెముడు సెంటర్ నుండి బ్రిడ్జి వరకు 1974లో 100 అడుగుల మేర భూసేకరణ చేశారని, ఈ స్థలాలను పెత్తందారులు ఆక్రమించారని అన్నారు. తొలుత వంద అడుగులు వెడల్పు చేస్తామన్న అధికారులు రాజకీయ ఒత్తిడి లొంగి 80అడుగులకు తగ్గించారని అన్నారు. ఒక్కోచోట ఒక్కోలాగా కొలతలు కొలిచి పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. అధికార పార్టీ నాయకులు తమ ఇష్టానుసారం చేయకుండా మక్కువ రోడ్డు వెడల్పులో సమన్యాయం పాటించాలని, ప్రభుత్వ స్థలాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా 200 మంది చిరు వ్యాపారులు అనేక ఏళ్ల నుంచి వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, వీరికి 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇచ్చి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూపించాలని కోరారు.షాపింగ్ కాంప్లెక్స్‌గా మార్చాలిమక్కువ మెయిన్ రోడ్డుకు ఆనుకొని బైరిసాగరం చెరువు ఇప్పటికే పెత్తందారుల ఆక్రమణకు గురైందని, వీటిని తొలగించి ఆ స్థలాల్లో చిరు వ్యాపారులకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఉచితంగా ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే బాధితులకు న్యాయం చేయక పోతే సిపిఎం ఆధ్వర్యంలో పోరాడుతామని హెచ్చరించారు.

## గెలవకపోతే ఆ రాష్ట్రానికి కేంద్రం నిధులివ్వదా?



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఏదైనా రాష్ట్రంలో బిజెపి గెలవకపోతే, ఆ రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం నిధులివ్వదా? ఇదేనా సమాఖ్య వాదమంటే? అంటూ సిపిఎం ఎంపి ఎఎ రహీమ్ ప్రశ్నించారు. గత తొమ్మిదేళ్లుగా అప్రకటిత ఆర్థిక ఆంక్షలు విధించినప్పటికీ కేరళ అభివృద్ధి చెందిందని, కేంద్ర ప్రభుత్వం, బిజెపి సహాయం లేకుండా రాష్ట్రం అభివృద్ధి చెందుతూనే ఉంటుందన్నారు. రాజ్యసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 'కేరళ అప్పుల ఊబిలో ఉందని బిజెపి, కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. కేంద్ర అప్పు రూ.1.97 లక్షల కోట్ల నుంచి రూ.2.14 లక్షల కోట్లకు పెరుగుతుందని బడ్జెట్ పత్రాలు చూపిస్తున్నాయి. ఇది జిడిపిలో 56 శాతం, కానీ కేరళది కేవలం 38.47 శాతం. కేంద్ర మంత్రి సురేష్ గోపి కేరళకు ఎయిమ్స్ కేటాయిస్తామని మాట్లాడారు. ఇది కేవలం ఖాళీ వాగ్దానం. మాజీ మంత్రి కూడా అయిన కేరళ బిజెపి అధ్యక్షులు, రాష్ట్రంలో బిజెపి ఎన్నికయ్యే వరకు కేంద్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వదని అన్నారు. ఇదేనా సమాఖ్యవాదం' అని ప్రశ్నించారు. దేశ యువతను నిరుద్యోగం వెంటాడుతుందని, జీవన వ్యయం పెరుగుతుందని పేర్కొన్నారు. దీనికి మూల కారణం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించి, బిజెపి ప్రభుత్వం కొనసాగిస్తున్న నవ ఉదారవాద విధానాలేనని స్పష్టం చేశారు. 'దేశంలో కాంట్రాక్టీకరణ, ప్రైవేటీకరణ పెరుగుతోంది. అగ్నివీర్‌తో సైన్యాన్ని కూడా కాంట్రాక్టుగా మార్చారు. శాశ్వత ఉద్యోగాలను తగ్గించడంతో ప్రభుత్వ రంగాన్ని నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఐటి, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సహా ప్రైవేట్ రంగంలో అధిక పనిభారం, లక్ష్యాల కారణంగా యువత ఇబ్బందులు పడుతుంది. అధిక పనిభారం కారణంగా ఆత్మహత్య చేసుకున్న అన్నా సెబాస్టియన్‌ను మనలో ఎవరూ మర్చిపోలేరు. గిగ్ ఎకానమీ పెరుగుతోంది. ఇది వ్యవస్థీకృత రంగం పతనం ఫలితంగానే జరిగింది. కాంట్రాక్టీకరణను నిలిపివేయాలని, ప్రస్తుతం ఖాళీగా ఉన్న అన్ని పోస్టులనూ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

## ఏపీలో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు రూ.2,279 కోట్లు




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ బ్యాంకుల్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు రూ.2,279.16 కోట్లు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. లోక్‌సభలో టీడీపీ ఎంపీ జీఎం హరీశ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సమాధానమిస్తూ.. గత నెల 28 నాటికి రాష్ట్రంలో సుమారు రూ.2,279.16 కోట్ల నిధులు క్లెయిమ్ చేయకుండా మిగిలిపోయాయని, ఈ సొమ్మును అసలైన యజమానులకు లేదా వారి వారసులకు చేర్చేందుకు కేంద్రం, ఆర్‌బీఐ సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టాయన్నారు. 'మీ సొమ్ము-మీ హక్కు' అనే ప్రచార కార్యక్రమంలో భాగంగా ఏపీలో 158 ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి 34,455 ఖాతాలకు సంబంధించి రూ.161.69 కోట్లను సెటిల్ చేశామన్నారు. కోనసీమ జిల్లాలో 1,899 ఖాతాలకు చెందిన రూ.5.08 కోట్లను వారసులకు అందజేసినట్లు తెలిపారు.

## మైనార్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ




**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో నీట్, ఈఏపీ సెట్ పరీక్షలకు హాజరయ్యే మైనార్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మైనార్టీ సంక్షేమ శాఖ నేతృత్వంలో, సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నీట్, ఈఏపీ సెట్‌ల పోటీ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించి వైద్య, ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు వీలుగా శిక్షణ ఇవ్వబోతున్నట్లు తెలిపారు. ఉచిత శిక్షణను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాలతో 45రోజులపాటు అందిస్తామన్నారు. నిష్ణాతులైన అధ్యాపకులతో బోధన ఉంటుందన్నారు. మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ కోసం సీఈడీఎం వెబ్‌సైట్ www.apced-mmwd.org లేదా cedmap2017@gmail.com ఫోన్ నంబర్-0866- 2970567, మొబైల్ నంబర్ 7386789966ను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

## పిన్నెల్లి బెయిల్ పిటిషన్ కొట్టివేత

**మాచర్ల, పతాకం న్యూస్:** వైసీపీ నేతలు, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డిల బెయిల్ పిటిషన్‌ను గురజాల కోర్టు కొట్టివేసింది. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడులో గతేడాది మే 24న జరిగిన టీడీపీ నేతలు జెవిశెట్టి వెంకటేశ్వర్లు, అతని సోదరుడు జెవిశెట్టి కోటేశ్వరరావు జంట హత్యల కేసులో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(ఏ6), పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి(ఏ7), పిన్నెల్లి వెంకటరెడ్డి(ఏ8)గా ఉన్నారు. వీరిలో వెంకటరెడ్డి గతేడాది డిసెంబరు 1న, మిగిలిన ఇద్దరు డిసెంబరు 11న మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోయారు. బెయిల్ కోసం వీరు దాఖలు చేసిన పిటిషన్‌పై గురజాలలోని పదో అదనపు జిల్లా జడ్జి కోర్టులో వాదనలు జరిగాయి. అనంతరం బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ న్యాయాధికారి జి.ప్రియదర్శిని ఆదేశాలు ఇచ్చారు.

# రాజముద్రతో ఇస్తున్న పట్టాదారు పాస్‌పుస్తకాల్లోనూ తప్పులు యథాతథం!




**అమరావతి, పతాకం న్యూస్:** గత వైసీపీ ప్రభుత్వ భూములను రీసర్వే చేసి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో పట్టాదారు పాస్‌పుస్తకాలను మంజూరు చేసింది. భూ విస్తీర్ణంలో తేడాలు, హద్దులు తప్పుగా నమోదు కావడం, తండ్రి పేరు, ఖాతా నెంబర్లలో పొరపాట్లు, ఒకరి భూమి మరొకరి పేరున నమోదు కావడం, జెండర్ మారిపోవడం వంటి తప్పులు చోటుచేసుకున్నాయి. రీసర్వేలో తప్పులు, జాయింట్ ఎల్‌పిఎంల వల్ల భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రీ సర్వే జరిగిన అన్ని ప్రాంతాల్లోనూ తప్పులను సరిచేసి ప్రభుత్వ రాజముద్రతో కొత్త పాస్‌పుస్తకాలు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. అయితే, 'రాజముద్రతో పాస్‌పుస్తకం ఇచ్చారు తప్ప, తప్పులను సవరించలేదని, పాత తప్పులే పునరావృతం అయ్యాయని రైతులు వాపోతున్నారు. దీనివల్ల బ్యాంకు రుణాలు, పంటల బీమా, ఇ-క్రాప్ నమోదులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, క్రయవిక్రయాలకు తీవ్ర ఆటకం ఏర్పడుతోందని ఆందోళన చెందుతున్నారు. తప్పులపై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా, తాజాగా సిసిఎల్ఎ నుంచి పట్టాదారు పాస్‌పుస్తకం ఆర్ఒఆర్‌లు విఆర్ఒ లాగిన్‌కు పంపుతున్నారని, డ్రాఫ్ట్ పాస్‌పుస్తకం ప్రింట్ తీసి భూ యజమానికి చూపి ఆమోదం తెలిపిన తర్వాత ఫింగర్ ప్రింట్‌తో ఇకెవైసి చేస్తున్నామని చెప్పుకొస్తున్నారు.

విజయనగరం మండలం పినవేమలికి చెందిన సుంకరి ఆదినారాయణ (ఖాతా నెంబర్ 195)కు 2.50 ఎకరాల భూమి ఉంది. రీ సర్వేలో ఇదే ఖాతాలో వేరొకరి పేరున కూడా జాయింట్ ఎల్‌పిఎం ఇచ్చేశారు. రాజముద్రతో ఇచ్చిన పాస్‌పుస్తకంలోనూ ఇదే తప్పు పునరావృతం అయింది. రీసర్వే తర్వాత గత ప్రభుత్వం ఇచ్చిన పాస్‌పుస్తకంలో కృష్ణా జిల్లా గుడివాడ మండలం బొమ్ములూరు గ్రామానికి చెందిన గుత్తా రవికుమార్‌కు 20 సెంట్లు, యడవల్లి రమాదేవికి ఐదు సెంట్లు, గంగాధరపురానికి చెందిన అట్లూరి శేషగిరి శైలుకు 13 సెంట్లు తక్కువగా చూపారు. గౌరిపర్తి ప్రశాంతికి 381 ఎల్‌పి నెంబర్లో 1.30 ఎకరాలు, కొప్పోలు రాజ్యలక్ష్మికి 383 ఎల్‌పి నెంబర్లో 50 సెంట్ల భూమి ఉంది. ఇద్దరి పాసు పుస్తకాలపైనా ఇతరుల ఫొటోలు ముద్రించారు. శౌంఠి సత్యనారాయణ 402 ఎల్‌పి నంబర్లో 1.60 ఎకరాల భూమి ఉంది. కాలమ్‌లో పురుషుడిని స్త్రీగా చూపారు. గుడ్లవల్లేరు మండలం చంద్రాలలో ఒసి సామాజిక తరగతికి చెందిన అర్జా కుమారి పాస్‌పుస్తకంలో ఎస్‌సిగానూ, బిసి సామాజిక తరగతికి చెందిన కోడూరు రామచంద్రరావు పుస్తకంలో ఎస్‌సిగానూ ముద్రించారు. వీటి స్థానంలో టిడిపి ప్రభుత్వం రాజముద్రతో ఇచ్చిన పట్టాదారు పాస్‌పుస్తకాల్లోనూ ఇదే తప్పులు పునరావృతం అయ్యాయి. కృష్ణా జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో 83,186 పాస్‌పుస్తకాలను పంపిణీ చేయగా, వాటిలో 10,746 పాస్‌పుస్తకాల్లో తప్పులు దొర్లాయి. వీటిని సరిచేయాలని రైతులు అప్పట్లో దరఖాస్తు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వీరికి రాజముద్రతో ఇచ్చిన పాస్‌పుస్తకాల్లోనూ ఇవే తప్పులు యథాతథంగా కొనసాగాయి.

నంద్యాల జిల్లా వెలుగోడు మండలం గుంతకందాలకు చెందిన రైతు వేముగడ్డ పెద్ద రాముడుకు 3.35 ఎకరాలు ఉన్నాయి. ఇందుకు సంబంధించి పాత పాస్‌పుస్తకం ఉంది. గత వైసిపి ప్రభుత్వం రీ సర్వే చేసి పంపిణీ చేసిన పాస్‌పుస్తకంలో జాయింట్ ఎల్‌పిపిఎం పేరుతో 16.37 ఎకరాలు చూశారు. కూటమి ప్రభుత్వం రాజముద్రతో ఇచ్చిన కొత్త పాస్‌పుస్తకంలో 18.64 ఎకరాలుగా పేర్కొన్నారు. నంద్యాల జిల్లా వెలుగోడు మండలం అబ్దులాపురం, గుంతకందాల గ్రామాల్లో ఒకరి పొలం మరొకరి పేరున నమోదు కావడం, ఒక ఎకరా ఉన్న రైతుకు పది ఎకరాలకుపైనే చూపించడం, పది ఎకరాలు ఉన్న రైతుకు ఒక ఎకరా చూపించడం వంటి తప్పులు పునరావృతం అయ్యాయి. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం భోగాపురంలో నల్లం సత్యవతికి సర్వే నెంబర్ 429/4 లో 2.55 ఎకరాల భూమి ఉండగా, ప్రభుత్వ రాజముద్రతో ఇచ్చిన పట్టాదారు పాస్‌పుస్తకంలోనూ గతంలోనే మాదిరిగానే 2.25 ఎకరాలు మాత్రమే చూపారు. ప్రభుత్వ రాజముద్రతో ఇప్పటికే ఇచ్చిన పట్టాదారు పాస్‌పుస్తకాల్లో దొర్లిన తప్పులను వెంటనే సరిచేయాలని, ఇకపై ఇవ్వబోయే పాస్‌పుస్తకాల్లో తప్పులు దొర్లకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

# ఉగాదికి టిడ్కో ఇళ్లు పంపిణీకి రంగం సిద్ధం?

**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా టిడ్కో గృహ సముదాయాల్లో పూర్తయిన లక్ష గృహాలను రానున్న ఉగాదికి లబ్ధిదారులకు అందించనున్నారు. ఇందులో 300 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న ఇళ్లు 54,934 - 365 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్నవి 16,223 - 430 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్నవి 28,986 ఉన్నాయి. ఉగాది సందర్భంగా సీఎం చేతులమీదుగా లబ్ధిదారులతో గృహప్రవేశాలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. వైఎస్సార్సీపీ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయకుండా పాడుపెట్టగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులను వేగవంతం చేసింది. గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు తెచ్చిన అప్పులను ఇతర అవసరాలకు మళ్లించింది.



జూన్ నాటికి అందించేలా ప్రణాళికలు: లబ్ధిదారుల వాటాగా బ్యాంకుల నుంచి రుణం తీసుకుని ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి వారికి అప్పగించకుండా తీవ్ర ఇక్కట్లకు గురిచేసింది. చాలామంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలు నిరర్థక ఖాతాలుగా మారాయి. అయితే ఆ తర్వాత కాలంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సమస్యలన్నీ ఒక్కొక్కటిగా అధిగమిస్తూ ఇళ్ల నిర్మాణాలను, మౌలిక వసతులను పూర్తి చేసింది.

టిడ్కో ఇళ్ల నిర్మాణానికి హడ్కో రుణాన్ని తీసుకునేందుకు వైఎస్సార్సీపీ హయాంలో రెండేళ్లుగా అధికారులు ప్రయత్నించారు. ఇదిగో, అదిగో అనడమే తప్ప ఒక్క రూపాయి కూడా ఇచ్చిన పాపాన పోలేదు. దాంతో ఫలితంగా బ్యాంకులైతే పూర్తిగా వెనకడుగు వేశాయి. కానీ తాజాగా ప్రభుత్వ గ్యారంటీతో రూ.4.451 కోట్ల రుణాన్ని ఇచ్చేందుకు హడ్కో ముందుకొచ్చింది. ఇది కాకుండా లబ్ధిదారుల వాటా మరో రూ.1500 కోట్ల వరకు సమకూరనున్నాయి. దీంతో మొత్తం నిర్మాణాలు జూన్ నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా ఇప్పటికే అధికారులు కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేశారు.

వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి సకాలంలో పూర్తి చేయకపోగా గుత్తేదారులకు బిల్లులు చెల్లించకుండా వేధించింది. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణ పనులు చేసిన వారికీ బిల్లులను ఎగ్గొట్టింది. ఇవన్నీ కలిపి దాదాపుగా రూ.500 కోట్లు పెండింగ్ బకాయిలను పెట్టింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆ నిధులను చెల్లించడంతోపాటు పనుల్లో ఏ విధమైన జాప్యం జరగకుండా ఎప్పటికప్పుడు గుత్తేదారులకు చెల్లింపులను చేస్తోంది.

పట్టణ ప్రాంతాల్లోని 2.61 లక్షల టిడ్కో ఇళ్లను జూన్ నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు ఆ ఇళ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల పనులకు ఏపీ టిడ్కో రూ.4,451 కోట్ల మేర హడ్కో నుంచి తీసుకునే రుణానికి ప్రభుత్వం హామీ ఇచ్చేందుకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. జగన్ ప్రభుత్వం చేపట్టిన 2.16 లక్షల గృహాల్లో 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే 77 వేల గృహాల్ని దాదాపు పూర్తి చేశామని మంత్రి నారాయణ వెల్లడించారు. మరో 64 వేల ఇళ్లు 50 - 75శాతం మేర పూర్తికాగా, ఇంకో 49 వేల గృహాలు 25 - 50శాతం వరకు, 1.20 లక్షల ఇళ్లు 25శాతం లోపు నిర్మాణ దశలో ఉన్నాయని మంత్రి వివరించారు. గత ఐదేళ్లలో నిర్మాణాలన్నీ పూర్తయ్యే అవకాశం ఉన్నా వైఎస్సార్సీపీ ప్రభుత్వం విస్మరించిందని చెప్పారు.

నిర్మాణాలను తిరిగి పునఃప్రారంభించాలంటే రూ.7,517 కోట్లు అవసరమని, పైగా జగన్ ప్రభుత్వం లబ్ధిదారుల పేరిట రుణాలు తీసుకొని ఇతర అవసరాలకు మళ్లించిందని పేర్కొన్నారు. రుణ మారిటోరియం గడువు పూర్తి కావడంతో బ్యాంకులు వాయిదాలు చెల్లించాలని లబ్ధిదారులపై ఒత్తిడి చేస్తున్నాయని, పేదల బ్యాంకు ఖాతాలు ఎన్‌పీఏలుగా మారే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. తాజా పరిస్థితిని సీఎం చంద్రబాబుకు వివరించడంతో పేదల బ్యాంకు ఖాతాలు ఎన్‌పీఏ కాకుండా రూ.102 కోట్ల విడుదలకు అంగీకరించారని వెల్లడించారు.

# గ్యాస్, అజీర్తి, మలబద్ధకం.. అన్నింటికీ ఒకేసారి చెక్ పెట్టాలంటే.

మారిన జీవన విధానం కారణంగా మనలో చాలా మంది జీర్ణ సమస్యలతో బాధపడుతున్నారు. గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం, ఉబ్బరం, ఆకలి లేకపోవడం వంటి వివిధ జీర్ణ సమస్యలతో బాధపడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ ఈ సమస్యలతో బాధపడుతున్నారు. క్రమరహిత భోజనం, ఫైబర్ లేని ఆహారం, నిద్రలేమి, వ్యాయామం లేకపోవడం వంటి వివిధ కారణాల వల్ల ఈ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యల బారి నుండి బయటపడడానికి చాలా మంది మందులను కూడా వాడుతున్నారు. పెద్ద వారితో పాటు పిల్లలు, యువత కూడా మందులను వాడే పరిస్థితి నెలకొంది. అయితే ఈ జీర్ణ సమస్యలను తగ్గించుకోవడానికి మందులు వాడాల్సిన పని లేదని మన జీవనశైలిలో మార్పులు చేసుకుంటే సరిపోతుందని వైద్యులు చెబుతున్నారు. జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వల్ల మందులు వాడాల్సిన అవసరం లేకుండానే జీర్ణ సమస్యలు తగ్గుతాయని అలాగే భవిష్యత్తులో కూడా రాకుండా ఉంటాయని వారు చెబుతున్నారు. జీర్ణసమస్యల నుండి బయటపడడానికి మన జీవనశైలిలో ఎటువంటి మార్పులు చేసుకోవాలో.. ఇప్పుడు తెలుసుకుందాం. గ్యాస్, ఉబ్బరం వంటి జీర్ణ సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే రోజూ నిర్ణీత సమయానికి భోజనం చేయాలి. ఎప్పుడు పడితే అప్పుడు భోజనం చేయడం వల్ల గ్యాస్ సమస్య పెరుగుతుంది. మనం రోజూ ఒకే సమయానికి భోజనం చేయడం వల్ల శరీర అంతర్గత గడియారం జీర్ణ ఎంజైమ్ లను సరైన సమయానికి విడుదల చేస్తుంది. దీంతో ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. గ్యాస్, ఉబ్బరం, మలబద్ధకం, ఆమ్లత్వం వంటి సమస్యలు రాకుండా ఉంటాయి. అలాగే తినేటప్పుడు టీవీ, సెల్‌ఫోన్ వంటి వాటిని చూడకూడదు. డిజిటల్



స్క్రీన్ లను చూడడం వల్ల మెదడు దృష్టి సరిగ్గా ఉండదు. దీంతో పేగులకు సంకేతాలు సరిగ్గా వెళ్లక ఉబ్బరం వంటి సమస్యలు తలెత్తుతాయి. కనుక తినేటప్పుడు మన దృష్టి అంతా మన భోజనంపై ఉండేలా చూసుకోవాలి. జీర్ణ సమస్యలు రాకుండా ఉండాలంటే రాత్రి పూట త్వరగా నిద్రించడం కూడా అవసరమని వైద్యులు చెబుతున్నారు. ఆలస్యంగా నిద్రించడం వల్ల ఆహారం సరిగ్గా జీర్ణమవ్వదు. దీంతో యాసిడ్ రిఫ్లెక్స్ వంటి సమస్యల బారిన పడాల్సి వస్తుంది. మనం ఆహారం తీసుకోవడానికి, నిద్రించడానికి మధ్యలో 2 నుండి 3 గంటల సమయం ఉండడం వల్ల తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది, శరీరం పోషకాలను సరిగ్గా గ్రహించుకుంటుంది. అలాగే మనం తీసుకునే ఆహారంలో ఫైబర్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, తృణ ధాన్యాలు, చిక్కుళ్లు వంటి వాటిని ఎక్కువగా తీసుకోవాలి. ఫైబర్ కలిగిన ఆహారాలను తీసుకోవడం వల్ల పేగులల్లో మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. మలబద్ధకం సమస్య తగ్గుతుంది. ఆహారంలో ఫైబర్ తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ మొత్తానికి మేలు కలుగుతుంది. అదే విధంగా రోజూ ఉదయం మల విసర్జన తప్పకుండా జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఉదయంపూట మలవిసర్జన చేయడం ఒక అలవాటుగా చేసుకోవాలి. మలవిసర్జన చేయడం వల్ల ఉబ్బరం, గ్యాస్ వంటి వాటితో పాటు ఇతర జీర్ణ సమస్యలు కూడా రాకుండా ఉంటాయి.

జీర్ణ సమస్యలతో బాధపడే వారు ప్రతిరోజూ వ్యాయామం చేయడం అవసరం. వ్యాయామం చేయడం వల్ల జీర్ణవ్యవస్థతో పాటు మొత్తం శరీరానికి మేలు కలుగుతుంది. వ్యాయామం చేయడం వల్ల పేగు కదలికలు ఎక్కువగా ఉంటాయి. దీంతో అజీర్తి, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు రాకుండా ఉంటాయి. ఈ విధంగా మన జీవనశైలిలో, మన ఆహారపు అలవాట్లల్లో మార్పులు చేసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుంది. తద్వారా జీర్ణ సమస్యలు రాకుండా ఉంటాయని మందులు వాడే అవసరం కూడా ఉండదని వైద్యులు పేర్కొంటున్నారు.

# తెల్ల జుట్టు నల్లగా మారాలంటే...

తెల్ల జుట్టు వచ్చిందన్న బాధ చాలా మందిలో ఉంటుంది. పక్కవారు ఏమనుకుంటున్నారో అన్న వేధన ఉంటుంది. ఇక తెల్ల జుట్టును నల్లగా మార్చడానికి హెన్నా, వివిధ రకాల షాంపూలు, ఖరీదైన డైలు వాడతారు.

దుమ్ము, కాలుష్యం కారణంగా మన జుట్టు పొడిగా, నిర్జీవంగా మారుతుంది. అంతే కాకుండా.. తెల్ల జుట్టు, తలపై వెంట్రుకలు రాలి పోవడం వంటి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉరుకుల పరుగుల జీవితం, పొల్యూషన్, మనం తినే ఆహారం కారణగా చిన్న వయసులోనే చాలా మంది జుట్టు సమస్యలతో సతమతమవుతున్నారు. ఇలాంటి సమయాల్లో ఖరీదైన షాంపూలు, కండిషనర్లు సీరమ్‌లు వాడుతుంటాం. ఇక, తెల్ల జుట్టు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. సాధారణంగా తెల్ల జుట్టు వృద్ధాప్యానికి సంకేతం. కానీ, చాలా మంది చిన్న వయసులోనే ఈ సమస్యతో బాధపడుతున్నారు.

ఇక, తెల్ల జుట్టు వచ్చిందన్న బాధ చాలా మందిలో ఉంటుంది. పక్కవారు ఏమనుకుంటున్నారో అన్న వేధన ఉంటుంది. ఇక తెల్ల జుట్టును నల్లగా మార్చడానికి హెన్నా, వివిధ రకాల షాంపూలు, ఖరీదైన డైలు వాడుతున్నారు. వెంట్రుకలు నల్లబడటానికి హెన్నా వాడకం శాశ్వత పరిష్కారం కానప్పటికీ, జుట్టు యొక్క తెల్లదనాన్ని కొంతకాలం దాస్తుంది. అయితే, మనలో చాలా మంది హెన్నా వేసి వేసి విసిగి చెంది ఉంటారు. అయితే, అలాంటి వారి కోసమే హెన్నా లేకుండా జుట్టును నల్లగా మార్చడంలో సహాయపడే కొన్ని రెమెడీల ముందుకు తీసుకు వచ్చాం. ఉసిరిలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, అవసరమైన కొవ్వు ఆమ్లాలు, వివిధ పోషకాలు మెండుగా ఉంటాయి. ఇవి జుట్టుకు పోషణ, బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఆయుర్వేద నిపుణుల ప్రకారం జుట్టు రాలే సమస్యను తగ్గించడంలో ఉసిరి ఎంతో మేలు చేస్తుంది. జుట్టు రాలడాన్ని తగ్గించడమే కాకుండా.. వెంట్రుకలు తెల్లబడకుండా ఉసిరి మెరుగ్గా పనిచేస్తుందట. వాడే పద్ధతి..ఉసిరి నూనెతో తలకు క్రమం తప్పకుండా మసాజ్ చేయండి. ఉసిరి పొడిని నీటిలో కలిపి పేస్ట్‌లా చేసి జుట్టుకు పట్టించాలి. ఉసిరి రసం తాగడం వల్ల జుట్టుకు మేలు జరుగుతుంది. కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్లు, బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టుకు బలాన్ని ఇస్తాయి. కరివేపాకు తీసుకోవడం వల్ల జుట్టు రాలడం, నెరిసే ప్రక్రియ నెమ్మదిస్తుంది.

వాడే పద్ధతి..కొబ్బరినూనెలో కరివేపాకును మరిగించాలి. ఆ తర్వాత వడగట్టి నూనె చల్లారనివ్వాలి. ఈ నూనెతో జుట్టుకు మసాజ్ చేయండి. ఇలా వారానికి రెండు మూడు సార్లు ఉపయోగిస్తే మంచి ఫలితాలు పొందవచ్చు. ఉల్లి రసం లేదా, ఉల్లి నూనె వల్ల కలిగే ప్రయోజనాలు గురించి మనకు ఇప్పటికే తెలుసు. జుట్టు, చర్మ రక్షణలో ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. ఉల్లిపాయ రసంలో అధిక మొత్తంలో సల్ఫర్ ఉంటుంది. ఇది జుట్టు మూలాలను పోషించడంలో, తెల్ల జుట్టును నల్లగా మార్చడంలో సాయపడుతుంది. వాడే పద్ధతి..తాజా ఉల్లిపాయను గ్రైండ్ చేసి దాని రసాన్ని తీయండి. ఈ రసాన్ని తలకు పట్టించి 30 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. దీని తర్వాత తేలికపాటి షాంపూతో జుట్టును శుభ్రపర్చుకోవాలి. వారానికి రెండు మూడు సార్లు ఇలా చేస్తే మంచి ఫలితాలుంటాయని నిపుణులు చెబుతున్నారు. తెల్ల జుట్టును నల్లగా మార్చే గ్రేట్ హెూం రెమెడీగా బ్లాక్ టీని పిలుస్తారు. బ్లాక్ టీ



# ఇక యూపీఐతో పీఎఫ్ డబ్బులు తీసుకోవచ్చు

## త్వరలోనే కొత్త యాప్.. ఈపీఎఫ్ఓ కీలక నిర్ణయం




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ఉద్యోగులకు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) శుభవార్త చెప్పింది. అత్యవసర సమయాల్లో పీఎఫ్ డబ్బులు తీసుకోవడానికి రోజుల తరబడి ఎదురుచూసే పనిలేకుండా, ఇకపై క్షణాల్లోనే డబ్బును విత్‌డ్రా చేసుకునే సౌకర్యాన్ని అందుబాటులోకి తేనుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కొత్తగా రూపొందించిన మొబైల్ యాప్ ద్వారా, 'యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ఫేస్' సాయంతో పీఎఫ్ సభ్యులు తమ డబ్బును నేరుగా బ్యాంక్ ఖాతాల్లోకి బదిలీ చేసుకోవచ్చు. ప్రస్తుతం పీఎఫ్ సేవలు ఉమాంగ్ యాప్ లేదా యూఏఎన్ పోర్టల్ ద్వారా అందుతున్నాయి. కానీ రాబోయే కొత్త యాప్ పూర్తిగా దీనికోసమే ప్రత్యేకంగా ఉంటుంది. ఈ యాప్‌లో సభ్యులు తమ ఖాతాలో ఎంత బ్యాలెన్స్ ఉందో చూసుకోవచ్చు. అందులో ఎంత మొత్తం విత్‌డ్రా చేసుకోవడానికి అర్హత ఉందో స్పష్టంగా కనిపిస్తుంది. బ్యాంక్ ఖాతాకు లింక్ అయిన యూపీఐ పిన్ ఉపయోగించి, సురక్షితంగా ఆ డబ్బును ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు. పాస్‌బుక్ బ్యాలెన్స్ చెక్ చేసుకోవడం, ఇతర సేవలు కూడా ఇందులో మరింత సులభంగా ఉంటాయి. పాత పద్ధతిలో క్లెయిమ్ ఫారం నింపి, అప్లై చేసే తిప్పలు తప్పుతాయి. ఈ కొత్త విధానం ఎలా పనిచేస్తుందో పరీక్షించడానికి ఈపీఎఫ్ఓ ఇప్పటికే రంగంలోకి దిగింది. సుమారు 100 డమ్మీ ఖాతాలతో ప్రస్తుతం ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. ఇందులో ఏవైనా సాంకేతిక లోపాలు ఉంటే సరిచేస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏప్రిల్‌లో ఈ యాప్‌ను ఘనంగా ప్రారంభించేందుకు కేంద్ర కార్మిక శాఖ సన్నాహాలు చేస్తోంది.

అయితే పీఎఫ్ ఖాతాలోని మొత్తం డబ్బును యూపీఐ ద్వారా తీసుకునే వీలుండదు. ఖాతాలోని కొంత మొత్తాన్ని ఫ్రీజ్ చేస్తారు. అంటే అది భవిష్యత్తు అవసరాల కోసం ఉంటుంది. మిగిలిన పెద్ద మొత్తాన్ని మాత్రం సభ్యులు తమ అవసరాలకు అనుగుణంగా యూపీఐ ద్వారా వాడుకోవచ్చు. అనారోగ్యం, చదువు, పెళ్లిళ్లు, ఇళ్లు కట్టుకోవడం వంటి అత్యవసరాలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇప్పుడున్న విధానంలో పీఎఫ్ డబ్బులు రావాలంటే క్లెయిమ్ అప్లై చేయాలి. అది ప్రాసెస్ అయ్యి డబ్బులు రావడానికి సమయం పడుతుంది. ఏటా సుమారు 5 కోట్ల క్లెయిమ్స్ వస్తున్నాయి. వీటిని పరిష్కరించడం ఈపీఎఫ్ఓకు పెద్ద భారం. ఈ టైమ్ టేకింగ్ ప్రాసెస్‌ను తగ్గించడానికే కొత్త యాప్‌ను తెస్తున్నారు. దీనివల్ల సభ్యులకు సమయం ఆదా అవుతుంది, అధికారులకు పని భారం తగ్గుతుంది. ఇప్పటికే ఈపీఎఫ్ఓ ఆటో సెటిల్మెంట్ మోడ్ ద్వారా సేవలను వేగవంతం చేసింది. దీని ద్వారా మాన్యువల్ ప్రమేయం లేకుండానే కంప్యూటర్ ద్వారా 3 రోజుల్లో క్లెయిమ్స్ పరిష్కారం అవుతున్నాయి. గతంలో దీని పరిమితి రూ.1 లక్షగా ఉండేది. ఇప్పుడు దాన్ని రూ.5 లక్షలకు పెంచారు. కోవిడ్ సమయంలో ప్రవేశపెట్టిన ఈ విధానం ఇప్పుడు ఎంతో మందికి ఆసరాగా నిలుస్తోంది.

ఈపీఎఫ్ఓకు బ్యాంకింగ్ లైసెన్స్ లేదు కాబట్టి నేరుగా ఏటీఎంలా డబ్బులు ఇవ్వలేదు. కానీ ప్రభుత్వం మాత్రం ఈపీఎఫ్ఓ సేవలను బ్యాంకుల స్థాయికి తీసుకురావాలని భావిస్తోంది. అందులో భాగంగానే ఈ యూపీఐ ఆధారిత విత్‌డ్రాయల్ సౌకర్యాన్ని తీసుకొస్తోంది. దేశంలోని దాదాపు 8 కోట్ల మంది పీఎఫ్ సభ్యులకు ఇది నిజంగానే ఒక శుభవార్త అని చెప్పవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# ఇచ్ఛాపురం-నెల్లూరు రైల్వేలైన్ 4 వరుసలకు పెంపు!



**అమరావతి, పతాకం న్యూస్:** ఏ రాష్ట్రమైనా అభివృద్ధి పథంలో నడవాలంటే అంతర్గత, బహ్య రవాణా వ్యవస్థ పటిష్ఠంగా ఉండాలి. అలా ఉన్నప్పుడే సరుకు రవాణా, ఎగుమతులు, దిగుమతుల్లో మంచి ఫలాలందుతాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం రవాణా సేవలు మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్లు రవాణా సేవల్ని పునరుద్ధరించింది. సరకు రవాణా వేగంగా చేసేందుకు ఇచ్ఛాపురం నుంచి నెల్లూరు వరకు ఉన్న రైల్వే లైన్లు 4 వరుసలకు పెంచితే మంచి అవకాశాలుండనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఈ అంశం గురించి మంత్రులు, కార్యదర్శుల సదస్సులో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 774 రైల్వే లెవెల్ క్రాసింగ్స్ ఉన్నాయి. వాటిని తొలగించడం కోసం ఆర్వోబీలు, ఆర్‌యూబీలు నిర్మించనున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. వీటి నిర్మాణాలకు రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు నిధుల కొరత ఉండదని, అవసరమైన భూసేకరణపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం అధికారులకు సూచించారు. నిర్ణీత గడువు పూర్తయ్యే లోపు నిర్మాణాలు చేపట్టడానికి కావాల్సిన భూములు సేకరించేలా చూడాలని పేర్కొన్నారు. కలెక్టర్లు ఇది తమకు సంబంధం లేని విషయమని, లాజిస్టిక్ వ్యవహారం మాకెందుకు అని నిర్లక్ష్యం చేయకూడదని సీఎం హెచ్చరించారు. 14 శాతం రవాణా ఖర్చే: ఏ ఉత్పత్తికైనా ఎగుమతులకు అయినా రవాణా ఖర్చు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఈ క్రమంలో చూసినట్లైతే ప్రస్తుతం ఉత్పత్తులకు సగటున 14 శాతం రవాణా ఖర్చు అవుతున్నట్లు అధికారిక గణాంకాలు తెలుపుతున్నాయి. దీన్ని 7నుంచి 8 శాతానికి తగ్గించడం లక్ష్యంగా పని చేస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.ఈ క్రమంలో కొత్త రైల్వే ప్రాజెక్టులపై దృష్టి సారించిన కేంద్రప్రభుత్వం హైదరాబాద్- చెన్నై హైస్పీడ్ కారిడార్ ఏర్పాటు లక్ష్యంగా పనులు చేపట్టింది. చెన్నై - రేణిగుంట వరకు ఒకటి రెండు మినహా లెవల్ క్రాసింగ్‌ల వద్ద ఇప్పటికే నిర్మాణాలు పూర్తి చేశారు. త్వరలో బుల్లెట్ రైలు నడిపే ఆలోచన ఉన్న నేపథ్యంలో రైల్వే లైన్ల సంఖ్య పెంచాలని సంబంధిత అధికారులు చూస్తున్నారు.




# టాప్ గ్రేడ్‌లో గిల్, బుమ్రా, జడేజా



2025-26 ఏడాదికి భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బిసిసిఐ) జాతీయ జట్టుకు ఆడే ఆటగాళ్లకు ఒప్పందం కుదుర్చుకొని వారికి గ్రేడ్‌లను ప్రకటించింది. సీనియర్ పురుషుల, మహిళల విభాగాల్లో జాతీయ జట్టుకు ఆడే క్రికెటర్లతో బిసిసిఐ ఈ ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా వీరంతా అక్టోబర్ 1, 2025 నుంచి సెప్టెంబర్ 30, 2026వరకు బిసిసిఐ కేటాయించిన మ్యాచ్‌లలోనే మాత్రమే ఆడాల్సి ఉంది. గత ఏడాదిలో ఎం గ్రేడ్‌ను ఈసారి తొలగించి కేవలం ఎ గ్రేడ్‌ను టాప్ గ్రేడ్‌గా ప్రకటిస్తూ.. వార్షిక గ్రేడ్ ఒప్పందాలను బిసిసిఐ ప్రకటించింది. ఎం గ్రేడ్‌ను తొలగించినప్పటికీ 30మంది సీనియర్ పురుషుల, మహిళల క్రికెటర్లతో కాంట్రాక్టులు కుదుర్చుకుంది. టెస్ట్, టి20లకు గుడ్‌బై చెప్పిన రోహిత్, విరాట్ కోహ్లితోపాటు కేవలం టి20లకే పరిమితమై ఆడుతున్న సూర్యకుమార్, రింకు సింగ్‌లకు గ్రేడ్-బిలో చోటు లభించింది. మూడు ఫార్మాట్‌లలో టీమిండియాకు ఆడుతున్న శుభ్‌మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా గ్రేడ్-ఎలో చోటు సంపాదించుకున్నారు. ఎ-గ్రేడ్ ఆటగాళ్లకు రూ.7కోట్లు, బి-గ్రేడ్ ఆటగాళ్లకు రూ.5కోట్లు, సి-గ్రేడ్ ఆటగాళ్లకు రూ.3కోట్లు బిసిసిఐ వార్షిక ఆదాయంగా అందజేయనుంది.

గ్రేడ్-ఎ : శుభ్‌మన్, బుమ్రా, జడేజా

గ్రేడ్-బి : సుందర్, రోహిత్, కోహ్లి, కెఎల్ రాహుల్, సిరాజ్, హార్దిక్, పంత్, కుల్దీప్, జైస్వాల్, సూర్యకుమార్, శ్రేయస్

గ్రేడ్-సి : అక్షర్, తిలక్ వర్మ, రింకు, దూబే, సంజు, అర్ష్‌దీప్, ప్రసిధ్, ఆకాశ్ దీప్, ధృవ్ జురెల్, హర్షిత్ రాణా, వరున్ చక్రవర్తి, నితీశ్ కుమార్, అభిషేక్ శర్మ, సాయి సుదర్శన్, బిష్ణోయ్, గైక్వాడ్.

# 15న యథావిధిగా భారత్-పాకిస్థాన్ మ్యాచ్




టీ20 వరల్డ్‌కప్‌లో భారత్‌తో మ్యాచ్ ఆడబోమంటూ ప్రకటించిన పాకిస్థాన్‌ప్రభుత్వం ఎట్టకేలకు వెనక్కి తగ్గింది. టీమ్‌ఇండియాతో మ్యాచ్ బాయ్‌కాట్ చేయాలనుకున్న తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. ఈ మేరకు పాకిస్థాన్ నుంచి సోమవారం అర్ధరాత్రి ప్రకటన వచ్చింది. పీసీబీతో ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్ చర్చల అనంతరం ఈ ప్రకటన వచ్చింది. ఈ చర్చలతో సంతృప్తి చెందడమే కాకుండా మిత్ర దేశాలు భారత్‌తో మ్యాచ్ ఆడాలని విజ్ఞప్తి చేయడంతో పాక్ ప్రభుత్వం పీసీబీకి అనుమతి ఇచ్చింది.

'భారత్‌తో మ్యాచ్ విషయంలో చర్చలపై సంతృప్తిగా ఉన్నాం. అలాగే మిత్ర దేశాల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని టీమ్‌ఇండియాతో మ్యాచ్ బాయ్‌కాట్ నిర్ణయాన్ని విత్ డ్రా చేసుకుంటున్నాం. టీ20 ప్రపంచ కప్‌లో షెడ్యూల్ ప్రకారం భారత్‌తో మ్యాచ్ ఆడాల్సిందిగా మా (పాకిస్థాన్) క్రికెట్ బోర్డును ఆదేశిస్తున్నాం. దీంతో ఫిబ్రవరి 15న భారత్‌తో మ్యాచ్ కోసం మా జట్టు మైదానంలోకి దిగుతుంది' అని పాక్ ప్రభుత్వం పత్రికా ప్రకటనలో పేర్కొంది.

అయితే వరల్డ్‌కప్‌లో భారత్‌తో మ్యాచ్ బాయ్‌కాట్ నిర్ణయంపై పునరాలోచించాలని ఇటీవల పీసీబీకి శ్రీలంక బోర్డు లేఖ రాసింది. అంతేకాకుండా శ్రీలంక ప్రధాని అనుర కుమార దిసనాయకే సైతం పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. దీనిపై ప్రకటన వచ్చిన తర్వాత దిసనాయకే పాక్ ప్రధానికి ఎక్స్ వేదికగా థాంక్స్ చెబుతూ పోస్టు షేర్ చేశారు. అనేక మంది ప్రేమించే ఈ మ్యాచ్ జరిగేలా చూసినందుకు షరీఫ్‌కు ధన్యవాదాలు తెలిపారు. 'ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు ధన్యవాదాలు. మనమందరం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కొలంబోలో భారత్- పాకిస్థాన్ వరల్డ్‌కప్ మ్యాచ్ షెడ్యూల్ ప్రకారం జరగనున్నందుకు సంతోషిస్తున్నాము. ఇందుకు సహకరించిన ఐసీసీకి సహ- ఆతిథ్య దేశంగా శ్రీలంక నుంచి ప్రత్యేక ధన్యవాదాలు. 1996 ప్రపంచ కప్ సమయంలో భద్రతా కారణాల వల్ల ఇతర జట్లు దూరంగా ఉన్నప్పుడు, భారత్- పాకిస్థాన్ కొలంబోలో ఆడిన సందర్భాన్ని మేం మర్చిపోలేదు' అని డిసనాయకే పోస్ట్‌లో చెప్పుకొచ్చారు.




# ఐశ్వర్య రాజేశ్ ఓటీటీ సినిమాల్లో క్రేజ్ తగ్గని క్రైమ్ థ్రిల్లర్!

అటు తమిళంలోను .. ఇటు తెలుగులోను ఐశ్వర్య రాజేశ్ కి మంచి క్రేజ్ ఉంది. ఓటీటీలలో ఐశ్వర్య రాజేశ్ సినిమాలను మళ్లీ మళ్లీ చూసేవారున్నారు. ఆమె ఎంచుకున్న కథలు .. పాత్రలు .. ఆ పాత్రలలో ఆమె జీవించే విధానమే అందుకు కారణమని చెప్పుకోవాలి. అలా ఆమె చేసిన సినిమాలలో ఓటీటీ వైపు నుంచి ఎక్కువ ఆదరణ పొందినవిగా ఫర్హానా .. డ్రైవర్ జమున .. సొపన సుందరి .. రన్ బేబీ రన్ కనిపిస్తాయి.

అయితే వాటి సరసనే కనిపించే మరో సినిమాగా 'థిట్టమ్ ఇరాండు' గురించి చెప్పుకోవచ్చు. 'థిట్టమ్ ఇరాండు' అంటే రెండో వ్యూహం అనే అర్థం ఉంది. అందువల్ల 'ప్లాన్ బి' అనే టైటిల్ తోను ఈ సినిమా ఓటీటీలో కనిపిస్తోంది. తెలుగులోనూ అందుబాటులో ఉంది. ఈ సినిమాలో పోలీస్ ఆఫీసర్ గా ఐశ్వర్య రాజేశ్ కనిపిస్తుంది. 2021లో రూపొందిన ఈ సినిమాను, క్రైమ్ థ్రిల్లర్ లను ఇష్టపడేవారు ఓటీటీలో సెర్చ్ చేసి మరీ చూడొచ్చు. కథలోకి వెళితే .. పోలీస్ ఆఫీసర్ 'అధీర' కొత్తగా ఆ సిరీకి వస్తుంది. డ్యూటీలో చేరిన తొలి రోజులలోనే, ఆమె చిన్ననాటి స్నేహితురాలు దీపాసూర్య అదృశ్యమవుతుంది. ఆ తరువాత కాలిపోయిన ఒక కారులో ఆమె మృతదేహం దొరుకుతుంది. ఆమె భర్త కిశోర్ తమకి శత్రువులెవరూ లేరని అధీరాతో చెబుతాడు. ఈ మిస్టరీని అధీరా ఎలా ఛేదిస్తుంది? అనేది కథ. ఆడియన్స్ గెస్ చేయని ట్విస్ట్ తో సాగే ఈ సినిమాను ఒకసారి ట్రై చేయవచ్చు.



# 11న నెట్‌ఫ్లిక్స్‌లో 'అనగనగా ఒక రాజు'



నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు'.. సంక్రాంతి కానుకగా.. జనవరి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయంతో పాటు కలెక్షన్స్ కూడా సాధించింది. ఈ సినిమాకు మారి దర్శకత్వం వహించగా.. సితార ఎంటర్‌టైన్ మెంట్స్ నిర్మించిన ఈ మూవీలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించింది. ఈ మూవీ ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు సిద్ధంగా ఉంది. ఫిబ్రవరి 11, 2026 నుండి ఈ సినిమా అందుబాటులోకి రానున్నట్లు నెట్‌ఫ్లిక్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేసింది. 'రాజుగారి పెళ్లంటే ఏడు తరాలు అటు ఇటు గుర్తుండిపోవాలి' అని స్పెషల్ పోస్టర్ షేర్ చేశారు.




# 13న 'అమరావతికి ఆహ్వానం' విడుదల



శివ కంఠంనేని, ధన్య బాలకృష్ణ, ఎస్తేర్, సుప్రిత, హరీష్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన సినిమా 'అమరావతికి ఆహ్వానం'. డైరెక్టర్ జీవీకే తెరకెక్కించారు. నిర్మాత ముప్పా వెంకయ్య చౌదరి నిర్మాణ సారథ్యంలో జి. రాంబాబు యాదవ్ సమర్పణలో లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బ్యానర్‌పై కెస్ శంకరరావు, ఆర్.వెంకటేశ్వరరావు నిర్మించారు. ఈ నెల 13న ఈ సినిమా విడుదల కానుంది. దసపల్లా హోటల్‌లో ఘనంగా జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు నటులు, నిర్మాత మురళీ మోహన్, హీరో అశ్విన్‌బాబు హాజరయ్యారు. నిర్మాత ఆర్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 'నేడు అమరావతికి ఎంతో ఖ్యాతి వస్తోంది. అలాంటి నగరం పేరుతో మేము హర్రర్ మూవీ చేశాం. మాకు ఈ చిత్రంతో సక్సెస్ దక్కుతుందనే నమ్మకం ఉంది. ఇప్పుడు ట్రైలర్ చూశాక మరింత పెద్ద హిట్‌ను ఆశిస్తున్నాం' అని అన్నారు. 'టైటిల్ చూసి ఇదోదే పొలిటికల్ మూవీ అనుకుంటున్నారు. కాదు.. ఇందులో ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదు. రెండున్నర గంటలు మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేసే హర్రర్ థ్రిల్లర్ మూవీ ఇది' అని డైరక్టర్ జీవీకే చెప్పారు. హీరో శివకంఠంనేని మాట్లాడుతూ 'సినిమా బాగా వచ్చింది. ఫస్ట్ కాపీ చూసుకున్నాం. ప్రేక్షకులకు రీచ్ అయ్యేలా ప్రమోట్ చేస్తున్నాం. ఎంటర్‌టైన్‌మెంట్‌కు మేము గ్యారెంటీ ఇస్తున్నాం' అని అన్నారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**